ఆంధ్రజ్యోతి
గుంటూరు
బుధవారం 16 అక్టోబరు 2024

విదేశీ నేస్తాలు వచ్చేశాయ్



- పక్షుల కిలకిలరావాలతో అలరారుతున్న ఉప్పలపాడు
- భారీగా తరలి వచ్చిన విదేశీ అతిథులు..
- నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతున్న పక్షుల కేంద్రం

8



- బ్యాక్‌వాకింగ్‌తో ఎంతో మేలు
- అదుపులో కొలెస్ట్రాల్, బీపీ, షుగర్
- రోజుకు 10-30 నిమిషాల నడకతో ఆరోగ్యం

వెనక్కి నడుద్దామా..

ఇన్‌చార్జి మంత్రుల నియామకం

- గుంటూరు జిల్లాకు కందుల దుర్గేష్
- పల్నాడుకు గొట్టిపాటి, బాపట్లకు పార్థసారథి
- రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ
- జిల్లాల అభివృద్ధి అంశాలపై ఇన్‌చార్జి మంత్రుల సమీక్షలు




గొట్టిపాటి రవికుమార్





కందుల దుర్గేష్





పార్థసారథి



గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరిగింది. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్షలు.. జిల్లా సమీక్ష మండలి సమావేశాలు.. ఇన్‌చార్జి మంత్రుల నేతృత్వంలో జరుగుతుంటాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం ఇన్‌చార్జి మంత్రుల నియామకం ఉంటుందని అందరూ భావించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇన్‌చార్జి మంత్రులను నియమించలేదు. ఈ క్రమంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా ప్రొటోకాల్ మంత్రిని నియమించి ఆ కార్యక్రమాన్ని సజావుగా జరిగేలా ప్రభుత్వం చూసింది. ఇప్పుడు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ మంగళవారం ఇన్‌చార్జి మంత్రుల నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు వెలువరించింది. దీంతో ఇక నుంచి జిల్లా అభివృద్ధికి సంబంధించి అన్ని అంశాలపై ఆయా ఇన్‌చార్జి మంత్రులు సమీక్షించనున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా సమీక్ష మండలి సమావేశాల్ని నిర్వహించి ప్రాధాన్య అంశాలపై చర్చించి ప్రభుత్వానికి నివేదించి వాటి పరిష్కారానికి ఇన్‌చార్జి మంత్రులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో డీఆర్సీ మీటింగ్ జరుగు తుంది. ఈ సమావేశం ఆరు నెలల వ్యవధిలో జరగడం అనేది తప్పనిసరి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఇప్పటికే నాలు గు నెలలు దాటడంతో పాటు ఇన్‌చార్జి మంత్రుల నియామకం కూడా జరగడంతో త్వరలోనే డీఆర్సీ మీటింగ్ జరపడానికి ఆయా జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పాలనాప రమైన వ్యవహారాలను కూడా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షించే వీలుంది. గత ప్రభుత్వంలో డీఆర్సీ సమావేశాలు ఓ దశ, దిశ లేకుండా మొక్కుబడిగా సాగేవి. కూటమి ప్రభుత్వంలో ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో జరిగే డీఆర్సీ సమావేశాలు జిల్లా సమగ్రాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

- గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కందుల దుర్గేష్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వంలో దుర్గేష్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరపున జనసేన అభ్యర్థిగా నిడదవోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొంది ఆ తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. దుర్గేష్‌కు ఇన్‌చార్జి మంత్రి పదవి రావడంతో గుంటూరు జిల్లా జనసేన పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.
- పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ నియమితులయ్యారు. బాపట్ల జిల్లా అద్దంకి అసెంబ్లీ నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ ఇంధనశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి కూటమి ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : మంత్రి రవికుమార్

పల్నాడు జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సమన్వయంతో పనిచేస్తానన్నారు. టీం వర్క్‌తో జిల్లాను ముందుకు తీసుకువెళతానన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించేందుకు ప్రయత్నిస్తానని గొట్టిపాటి చెప్పారు.

- బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొలుసు పార్థసారథి నియమితులయ్యారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్థసారథి కూటమి ప్రభుత్వంలో గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో త్వరలో డీఆర్సీ మీటింగ్ జరగనున్నది.

కొనుగోళ్లపై కలవరం

- మార్కెట్‌లో పత్తి ధర పతనం
- మార్కెట్ శాఖ సిద్ధం.. ఊసెత్తని సీసీఐ
- మద్దతు ధర దక్కకపోవడంతో రైతు దిగాలు
- క్వింటాకు రూ.1,500 వరకు ధర తగ్గిన వైనం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల ఇంట సిరులు కురిపించాల్సిన తెల్ల బంగారానికి ఆరంభంలోనే మద్దతు ధర కరువవుతోంది. ధర నేల చూపులు చూస్తుండటంతో రైతుల్లో కలవరం మొదలైంది. సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందా లేదా అన్న సందిగ్ధం రైతుల్లో నెలకొంది. సీసీఐ కేంద్రాలు ఇంకా ఏర్పాటు కాలేదు. మార్కెట్ యార్డులో కేంద్రాల ఏర్పాటు విధానానికి సీసీఐ స్వస్తి పలికింది. అయితే పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసే దిశగా సీసీఐ ఉంది. అయితే వాటికి సంబంధించి కూడా ఇంకా నోటిఫై చేయకపోవడం రైతులకు శరాఘాతంగా మారింది. మార్కెట్ శాఖ పత్తి కొనుగోలుకు సీసీఐకి సహకరించేందుకు సమాయత్తమైనా సీసీఐలో ఇంకా చలనం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 14 కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రైతులు చేతికి వచ్చిన పత్తిని విక్రయిస్తుండగా ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.6500 నుంచి రూ.6 వేలకు అడుగుతున్నారు. క్వింటాకు కేంద్రం మద్దతు ధర 7,521 ప్రకటించగా మార్కెట్‌లో అంతకుమించి ధర పలుకుతుందని రైతులు ఆశించారు. అయితే రూ.2000 వరకు ధర తగ్గడంతో రైతులు ఉసూరుమంటున్నారు. గతంలో మార్కె ట్ యార్డుల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి సీసీఐ పత్తి కొనుగోలు చేసేది. గత ఏడాది నుంచి ఈ విధానానికి స్వస్తి పలికింది. యార్డుల్లో కేంద్రాలకు బదులు పత్తి మిల్లులోనే కేంద్రాలను నిర్వహిస్తోంది. రైతులు నేరుగా వారి ప్రాంతానికి కేటాయించిన మిల్లుకు పత్తి తీసుకుపోవాలి. ఈ విధానంలో కేంద్రాలు అందుబాటులో లేక పోవడంతో రైతులపై రవాణా భారం పడుతుంది. నరసరావుపేట ప్రాంతంలో రైతులు చిలకలూరిపేట జిన్నింగ్ మిల్లుకు తీసుకుపోవాల్సి వస్తుంది.

రోజురోజుకు ధరలు పతనం..

పత్తి ధరలు బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పతనమవుతున్నాయి. సీసీఐ కేంద్రాలను త్వరతగతిన ఏర్పాటు చేస్తేనే ధర నిలకడగా ఉంటుంది. అయితే ఇంతవరకు సీసీఐ నుంచి చలనం లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు మాయాజాలానికి తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేటై ధరలను తగ్గించేశారు. పత్తి చేతికి వచ్చే సమయంలో ధరలు దిగజారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల్లోనే క్వింటాకు రూ.1500 నుంచి రూ.2000 వరకు పడిపోయింది.

రైతుల ఆశలు ఆవిరి..

ఆగస్టు వరకు ధరలు మార్కెట్‌లో స్థిరంగా ఉన్నాయి. మార్కెట్‌లో పత్తికి మంచి ధర ఉండటంతో రైతులు ఆ ధరలను చూసి ఖరీఫ్‌లో పత్తి సాగు చేశారు. వేసవిలోనే పల్నాడు ప్రాంతంలో బోరు బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పత్తి చేతికి వచ్చింది. దిగుబడులు ఆరంభం కావడంతో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. రికార్డు స్థాయి ధరలను చూసి సాగు చేసిన రైతులు నిరాశకు గురయ్యారు. పత్తి చేతి కొచ్చే సమయంలో ధర పడిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రూ.8 వేల నుంచి రూ.6,500 నుంచి రూ.6 వేలకు ధర పడిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో రైతులు సీసీఐ కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు.

2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2.12 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పల్నాడు ప్రాంతంలో దిగుబడులు వచ్చాయి. 1,54,875 ఎకరాల్లో సాగుతో పల్నాడు జిల్లాలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. గుంటూరు జిల్లాలో 53,275 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,065 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల, క్రోసూరు, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలు మంజూరు కాగా ఆయా కేంద్రాలకు ఇన్‌చార్జిలను కూడా నియమించారు. అయితే కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధరకు ప్రభుత్వం పత్తి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై మార్కెటింగ్ శాఖ ఏడీఎం సూర్యప్రకాష్‌రెడ్డిని వివరణ కోరగా ఇంకా రానున్న వారం రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు. సీసీఐకి పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు.

- గడువుదాటినా విధుల్లో చేరని కార్యదర్శులు
- నచ్చిన చోటు కోసం కార్యాలయంలో బేరసారాలు
- ప్రజాప్రతినిధులను సైతం పక్కదారి పట్టిస్తున్న వైనం

పంచాయతీల కోసం పైరవీలు



గుంటూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీల గడువు ముగిసింది. అయినా పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయిన స్థానాల్లో చేరలేదు. తమకు అనుకూలమైన.. కావాల్సిన పంచాయతీలో పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తూనే ఉన్నారు. బదిలీ అయిన పంచాయతీలో జాయిన్ కాకుండా గుంటూరులోని పంచాయతీ అధికారి కార్యాలయం చుట్టూ కొందరు తిరుగుతున్నారు. గ్రేడ్‌తో సంబంధం లేకుండా అధిక ఆదాయం కలిగిన పంచాయతీలో చోటు దక్కించుకునేందుకు నగదు కొట్టేందుకు కూడా సిద్ధమై పావులు కదుపుతున్నారు. డీపీవో కార్యాలయం లోని ఇద్దరు ఉద్యోగులు పైరవీలు చేసే కార్యదర్శులకు అభయ హస్తం అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బదిలీల్లో గ్రేడ్-5 కి చెందిన వారే ఎక్కువ మంది ఇంకా జాయిన్ కాలేదని తెలుస్తోంది. ఉదాహరణకు పిడుగురాళ్ల మండలం పందిటివారిపాలెం, చెన్నాయపాలెం, గుత్తికొండ-2 పంచాయతీలకు బదిలీ అయిన కార్యదర్శులు ఇంకా జాయిన్ కాలేదని సమాచారం. ప్రత్తిపాడు మండలంలో కూడా కొందరు పంచాయతీ

(మిగతా 8వ పేజీలో..)

గుంటూరుకు దసరా కానుక

- నాలుగు వరసల్లో అరండల్‌పేట ఆర్‌వోబీ
- రూ.98 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజలకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దసరా పండుగ కానుకని అందించారు. రెండు దశాబ్దాలకు పైగా కాగితాలకే పరిమితమైన అరండల్‌పేట రైల్వే ఓవర్ బ్రిడ్జికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి తన సత్తా చాటారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నిలబెట్టుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది. ట్రాఫిక్ సమస్యలను తీర్చడంలో ప్రధాన పాత్ర పోషించే అరండల్‌పేట ఆర్‌వోబీని నాలుగు వరసలుగా విస్తరింప చేయడం తన ధ్యేయమని ఎన్నికల ప్రచారంలో పెమ్మసాని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ ఆర్‌వోబీ కోసం అటు రైల్వే, ఇటు జాతీయ రహదారుల శాఖలకు నివేదిస్తూ వచ్చారు. పెమ్మసాని కృషి ఫలితంగా సీఆర్‌ఐఎఫ్(సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) సేతుబంధన్ పథకం కింద ఆర్‌వోబీకి రూ.98 కోట్లను మంజూరు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి ఎక్స్ ఖాతా వేదికగా మంగళవారం ప్రకటించారు. పెమ్మసాని తొలుత జూలై 30న కేంద్ర ప్రభుత్వానికి అరండల్‌పేట ఆర్‌వోబీ విస్తరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు రూ.108 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. రివైజ్ చేసిన కేంద్ర ప్రభుత్వం రూ.98 కోట్లను సీఆర్‌ఐఎఫ్ పథకం కింద మంజూరు చేస్తున్నట్లుగా పరోక్షంగా ప్రకటించింది. నిధులకు సంబంధించి 3-4 రోజుల్లో కేంద్రం అధికారికంగా ప్రకటన విడుదల చేస్తుందని పెమ్మసానికి సమాచారం అందింది.



డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



అరండల్‌పేట ఆర్‌వోబీ

వరుస కడుతున్న ప్రాజెక్టులు

గుంటూరు పార్లమెంటుకు ప్రాజెక్టులు, పరిశ్రమలు క్యూ కట్టేలా పెమ్మసాని కృషి చేస్తున్నారు ఇందులో భాగంగానే గత వారంలో అమరావతికి రూ.250 కోట్లతో టెక్నాలజీ సెంటర్, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి, తాజాగా అరండల్‌పేట ఆర్‌వోబీకి కేంద్రంతో ఆమోదముద్ర వేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు గుంటూరులోని సంబం ధిత శా ఖాధికారు లతో పెమ్మ సాని ప్రతీ వా రం పలు సమీ క్షలు నిర్వహించ డంతోపాటు కేంద్ర ప్రభుత్వంతోనూ అనేక సార్లు సమా వేశాలు జరిపారు.

66 ఏళ్ల నుంచి ఆర్‌వోబీ సేవలు

అరండల్‌పేట ఆర్‌వోబీకి ఎంతో ఘన చరిత్ర ఉన్నది. 1958లో అప్పటి ప్రజల అవసరాలను తీర్చేందుకు దీనిని నిర్మించారు. కేవలం రూ.8.37 లక్షలతోనే నిర్మాణం జరిగింది. 2004 వరకు బ్రిడ్జిపై రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. టూవీలర్స్, కార్లు, ఆటోలు, బస్సుల సంఖ్య పెరగడంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెగా ఫ్లైఓవర్ ఆలోచన చేసినా అడుగులు ముందుకు పడలేదు. తన ఎన్నికల హామీలను డాక్టర్ పెమ్మసాని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు.

- ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపించడం లేదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తిమనోజ తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలకు సంబంధించిన జీవోలను నేటికీ విడుదల చేయలే దన్నారు. కనీస వేతనాల అమలు, బిల్లుల చెల్లింపు తదితర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశా రు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడు తూ అంగన్ వాడీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి జిల్లా అధికారుల సంతకం కోసం దాదాపు ఏడాది నుంచి ఎదురుచూడాల్సిన దయనీయమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం పీడీ ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు రాధా, చిన్నవెంకాయమ్మ, సుకన్య, రత్నమంజరి, విజయకుమారి, అనురాధ, శశికళ సీఐటీయూ నాయకులు లక్ష్మణరావు, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

వార్డు సచివాలయంలో కుప్పకూలిన సీలింగ్

- తెనాలిలో తొమ్మిది మంది ఉద్యోగులకు తప్పిన పెను ప్రమాదం
- కంప్యూటర్లు, ఫర్నిచర్ ధ్వంసం
- వైసీపీ ప్రభుత్వ కాలంలో నాసిరకం పనులే కారణం

6



తెనాలి 13 వార్డు సచివాలయం హాల్‌లో కుప్పకూలిన సీలింగ్, కంప్యూటర్లు, టేబుళ్లపై విరిగి పడిన సీలింగ్ పలకలు

ఇసుక తవ్వకాలకు ఏజెన్సీల ఖరారు

- నాలుగు క్వారీలకు డీఎల్ఎస్‌సీ సభ్యుల అనుమతి



ఇసుక టెండర్ల సీల్డ్ బాక్సు తెరిచి బిడ్లు పరిశీలిస్తున్న డీఎల్ఎస్‌సీ సభ్యులు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు ఇసుక క్వారీల్లో తవ్వకాలకు ఏజెన్సీలు ఖరారయ్యాయి. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ మీటింగ్ హాల్‌లో జిల్లా ఇసుక కమిటీ సభ్యులు కాంట్రాక్టర్ల సమక్షంలో సీల్డ్‌బాక్సు తెరిచి బిడ్ డాక్యుమెంట్లను ఒక్కోటిగా పరిశీలించారు. ప్రధానంగా టన్నుకు రూ.110 కంటే తక్కువ మొత్తానికి బిడ్ దాఖలు చేస్తే దానిని పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. దాంతో గుత్తేదారుల్లో ఎక్కువ మంది రూ.110కి మాన్యువల్‌గా ఇసుక తవ్వి స్టాక్‌యార్డుకు తరలించడంతో పాటు లోడింగ్ చేస్తామని ముందుకొచ్చారు. మున్నంగి క్వారీకి 13, గుండిమెడకు 12, బొమ్మువానిపాలెం-14 రీచ్‌కు 13, బొమ్మువానిపాలెం-15 క్వారీకి 14 బిడ్‌లను కాంట్రాక్టర్లు దాఖలయ్యాయి. మున్నంగి రీచ్‌కు ఐదుగురు, గుండిమెడకు ఆరుగురు, బొమ్మువానిపాలెం-14కు మూడు, బొమ్మువానిపాలెం-15కి ముగ్గురు మాత్రమే అర్హత పొందారు. దీంతో లాటరీ తీయగా మున్నంగి రీచ్‌ని మెస్సర్స్ సాయి భవాని, గుండిమెడని మెస్సర్స్ సాయిభవానీ, బొమ్మువానిపాలెం-14ని నాగేంద్ర ఇన్‌ఫ్రా, బొమ్మువానిపాలెం-15ని గోదావరి కృష్ణా వాటర్ వేస్ ట్రాన్స్‌పోర్టు సంస్థలను అదృష్టం వరించింది. టెండర్ల నిర్వహణలో జేసీ భార్గవతేజ, అసిస్టెంట్ కలెక్టర్ పొవార్, మైనింగ్ డీడీ ధూళిపాళ్ల శ్రీవెంకటసాయి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిజాంపట్నం కాల్వలో రెండు మృతదేహాలు

అమృతలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా నిజాంపట్నం కాల్వలో రెండు మృతదేహాలు ఉండటంతో కలకలం రేగింది. మండల పరిధిలోని కూచిపూడి లాకు- మండూరు వంతెనల మధ్య కాల్వలో రెండు మృతదేహాలను స్థానికులు గుర్తించారు. కాల్వలో ఆడ, మగ రెండు మృతదేహాలు ఒకే చోట ఉండటం ఆత్మహత్యకు పాల్పడ్డారా అని స్థానికుల్లో చర్చనీయాశంగా మారింది. ఈ విషయం పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్ చేరుకున్నారు. మృతదేహాలను కాల్వలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టమ్ నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. కూచిపూడి వీఆర్వో విజయకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడిపై కేసు నమోదు

అమృతలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి రూ. 10 వేలు లాక్కున సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లా కేంద్రం బాపట్లకు చెందిన వ్యక్తి గిద్దలూరు వెళ్లేందుకు బాపట్ల బస్టాండ్ వద్ద సోమవారం వేకువజామున వేచి ఉన్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఆ వ్యక్తిని కిడ్నాప్ చేసి కారులో ఎక్కించారు. కారులో అతన్ని అటూ ఇటూ తిప్పి మండల పరిధిలోని ఇంటూరు లాకు వద్ద అతనిపై దాడి చేసి రూ.10 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. అతన్ని అక్కడ వదిలేసి ఆ నలుగురు వ్యక్తులు అదే కారులో ఉడాయించారు. బాధితుడు అమృతలూరులో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 6182 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,638 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 44,793 క్యూసెక్కులు నీరు దిగువకు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 44,793 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

వార్డు సచివాలయంలో కుప్పకూలిన సీలింగ్

- తొమ్మిది మంది ఉద్యోగులకు తెనాలిలో తప్పిన పెను ప్రమాదం
- కంప్యూటర్‌లు, ఫర్నిచర్ ధ్వంసం
- వైసీపీ ప్రభుత్వ కాలంలో నాసిరకం పనులే కారణం


తెనాలి 13 వార్డు సచివాలయం హాల్‌లో కుప్పకూలిన సీలింగ్, కంప్యూటర్‌లు, టేబుళ్లపై విరిగి పడిన సీలింగ్ పలకలు


సీలింగ్ ఊడి పడటంతో దెబ్బతిన్న ఫ్యాన్

తెనాలి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ హాల్ సీలింగ్ మొత్తం ఒక్కసారిగా కుప్పకూలింది. కంప్యూటర్‌లు, ఫర్నిచర్ ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో సిబ్బంది, జనం లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో రూ. 49 లక్షలతో నిర్మించిన భవనం పనులు నాసిరకంగా ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో లేకపోవటం వలన ప్రాణాలు దక్కాయని తొమ్మిది మంది సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. తెనాలి పట్టణంలోని చినరావూరు 13వ నంబర్ సచివాలయాన్ని ఒక కమ్యూనిటీ హాల్‌లో మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. దీనికిముందు ప్రభుత్వ సొంత భవనం ఒకటి ఉంటే దానిలో నిర్వహించారు. అయితే ఆ భవనం శిథిల స్థితికి చేరటం, స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో ప్రమాదకరంగా ఉందని దానిని ప్రస్తుత కమ్యూనిటీ హాల్‌పైకి మార్చారు. కమ్యూనిటీ హాల్ పైభాగంలో రేకులతో హాల్ ఏర్పాటు చేసి, దానిలోకి మార్చారు. శిథిల స్థితిలో ఉన్న భవనంలో ప్రమాదం నుంచి తప్పించుకుందామనుకుంటే, కొత్తగా ఏర్పాటు చేసుకున్న హాల్‌లోనూ సీలింగ్ రూపంలో ప్రమాదం సంభవించింది. అయితే సోమవారం పగలంతా సిబ్బంది పని చేశారని, జనం కూడా తమ పనుల కోసం భారీగానే సచివాలయానికి వచ్చి వెళ్లారని, ఆ సమయంలో ప్రమాదం జరిగి ఉంటే చాలా మంది తీవ్ర గాయాలబారిన పడాల్సి వచ్చేదని సిబ్బంది భయం వ్యక్తం చేశారు. సోమవారం విధులు పూర్తి చేసుకుని ఆ హాల్‌కు తాళం వేసి వెళ్లి పోయామని, మంగళవారం వచ్చి తలుపులు తీసిచూస్తే సీలింగ్ మొత్తం ఊడిపడి ఉందని, కంప్యూటర్‌లు, ఫర్నిచర్‌పై పడటంతో మొత్తం ధ్వంసం అయ్యాయని సిబ్బంది చెబుతున్నారు. సీలింగ్‌తోపాటు విద్యుత్ లైట్లు, వైరింగ్ మొత్తం కిందికి వేలాడుతుంది. ఆ సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశామని సిబ్బంది చెప్పారు.

కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి

సంఘటన విషయం తెలుసుకుని వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత పరిస్థితిని పర్యవేక్షించారు. కేవలం కాంట్రాక్టర్ నాసిరకం పనుల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీనికి కాంట్రాక్టర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. అయితే సీలింగ్ కుప్పకూలిన పరిస్థితిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ సీలింగ్ దెబ్బతింటే, ఆ దెబ్బతిన్న వరకు పలక ఊడిపడటం సహజం. పెద్ద హాల్ కావడం, మొత్తం హాలులోని సీలింగ్ కుప్పకూలడం అనుమానాలకు తావిస్తోంది. సీలింగ్‌కు వేసిన అల్యూమినియం చానల్స్‌తోసహా ఊడి పడితే పైన రేకుల కప్పు కావటంతో గట్టిదనం లేక ఊడి పడిందనుకోవచ్చు. కానీ రేకులకు అమర్చిన చానల్స్ అన్నీ సక్రమంగానే ఉంటే, కేవలం ప్లాస్టర్‌ఆఫ్‌ప్యారిస్ పలకల వరకే మొత్తం ఊడి పడటం చూస్తే ఎవరైనా కావాలని చేశారా లేక నిజంగా నాసిరకం పనుల వల్లే ఊడి పడిందా అనేది అంతుపట్టని విషయం.

మున్సిపల్ ఇంజనీర్లను పంపించాం..

అయితే సీలింగ్ కుప్పకూలిన ఘటనపై పరిశీలనకు మున్సిపల్ ఇంజనీర్లను పంపించామని, వారు పరిశీలించాక కూలటానికి గల కారణాలపై నిర్ధారణకు వస్తామని, ఆ తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ శేషన్న వివరించారు.

కిక్కుకి.. కొత్త చిక్కు!

- మళ్లీ అమల్లోకి రహదారుల నిబంధన
- రాష్ట్ర రహదారులకు 220 మీటర్ల దూరం పాటించాలి
- దుకాణాల కోసం మద్యం వ్యాపారుల వేట

వేమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం నూతన విధానంలో దుకాణాల ఏర్పాటుకు కొత్త చిక్కు ఏర్పడింది. గతంలో కేంద్ర, రాష్ట్ర రహదారులకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలనే నిబంధనను మళ్లీ అమల్లోకి తేవడంతో మద్యం దుకాణాలు దక్కించుకున్నవారు తలలు పట్టుకుంటున్నారు. ఈ నెల 16 నుంచి ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ప్రభుత్వం అమల్లోకి తెస్తుంది. ఇందుకు సంబంధించి దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ, లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు కూడా ఎక్సైజ్ శాఖ పూర్తి చేసింది. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు ఉత్సాహంగా దుకాణాలు ఏర్పాటుకు సిద్ధం కాగా ఎక్సైజ్ శాఖ రాష్ట్ర రహదారులకు 220 మీటర్లు, జాతీయ రహదారులకు 500 మీటర్ల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో మద్యం వ్యాపారులు కంగుతిన్నారు. ఇప్పటికే ప్రభుత్వ దుకాణాలు ఏర్పాటు చేసిన వాటినే ఎంచుకోగా ఎక్సైజ్ శాఖ నిబంధనతో దుకాణాల కోసం వేట మొదలు పెట్టారు. వాణిజ్య ప్రాంతాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఊరి వెలుపల కాని లేదా నివాస గృహాల మధ్యన కాని చేయాల్సి ఉంటుంది. దీనివల్ల కొత్త తలనొప్పులు వచ్చే అవకాశం ఉంది. నివాస గృహాల మధ్య దుకాణాల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు గతంలోనే ఎన్నోసార్లు దుకాణాన్ని వ్యతిరేకిస్తూ రోడ్డు ఎక్కారు.

2015లోనే అమల్లోకి..

2015లోనే జాతీయ, రాష్ట్ర రహదారులకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఆ సమయంలో టీడీపీ అధికారంలో ఉంది. అప్పుడు కూడా లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించారు. అయితే నూతన నిబంధన వలన మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఏర్పాటు చేయలేకపోవడం రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. దీంతో ప్రభుత్వం రాష్ట్ర రహదారుల పేరును సవరిస్తూ కొత్త జీవోను తీసుకురావడంతో మూడు నెలల తరువాత వాణిజ్య ప్రాంతాల్లో మద్యం వ్యాపారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ ఈ నిబంధనను ఇంతవరకు అమల్లోకి తీసుకు రాలేదు. మళ్లీ ఇప్పుడు కొత్తగా రహదారుల నిబంధనను తీసుకురావడంతో మద్యం వ్యాపారులు అయోమయంలో పడ్డారు.

మళ్లీ సవరిస్తారని వ్యాపారుల ఆశలు

రాష్ట్ర రహదారుల వెంబడి మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనను ప్రభుత్వం సడలిస్తుందనే ఆశలో వ్యాపారులు ఉన్నారు. లేదంటే వాణిజ్య ప్రాంతానికి దూరంగా నివాస గృహాలకు దగ్గరలో షాపులు ఏర్పాటు వల్ల ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు మద్యపాన ప్రియులు వల్ల ఇబ్బందులు పడతారని ఆ ప్రభావం మద్యం దుకాణాలపై ఉంటుందని వ్యాపారులు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి వెంటనే సరైన నిర్ణయం తీసుకోకపోతే నివాస గృహాల సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు వల్ల ప్రజలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

రైల్వే ట్రాక్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

- అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం


కుంగిన రైల్వే ట్రాక్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పొన్నూరుటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాచవరం రైల్వే స్టేషన్ పరిధిలో కుంగిన రైల్వే ట్రాక్‌కు అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ నుంచి రెండు కిలోల మీటర్ల దూరంలో బాపట్ల జిల్లా పరిధిలోని చుండూరుపల్లి గ్రామ సమీపంలో కొల్లిమర్ల డ్రెయిన్ దగ్గర భారీ వర్షాలకు రైల్వే ట్రాక్ సుమారు వంద మీటర్లపైన కుంగింది. సోమవారం రాత్రి తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌లోని లోపాలను గుర్తించారు. ఎక్స్‌ప్రెస్‌ను వెనక్కి మళ్లించి అప్పికట్ల రైల్వే స్టేషన్‌లో గంటపాటు నిలిపివేశారు. వంద మీటర్ల మేర ట్రాక్ భూమిలోకి కుంగిపోయి ఉండటాన్ని గమనించిన అధికారులు తక్షణమే రైళ్ల రాకపోకలను నిలిపేశారు. ఈ ట్రాక్‌పై వేగంగా వెళ్లే వందే భారత్ రైలు ప్రయాణించి ఉంటే పెను ప్రమాదం జరిగేది. ట్రాక్ కుంగిపోయిన ప్రాంతం కేవలం కొల్లిమర్ల డ్రెయిన్‌కు వంద మీటర్ల లోపు ఉంది. ఈ ట్రాక్ పక్కనే వర్షపు నీరు వేగంగా ప్రవహించటంతో భూమి కదిలి మట్టి పక్కకు జారి పోవడాన్ని అధికారులు గుర్తించారు. ఇది విజయవాడ, చెన్నై ప్రధాన లైన్ కావటంతో రైళ్ల రద్దీ అధికంగా ఉంటుంది. తక్షణమే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించేందుకు ఇటీవల నూతనంగా నిర్మించిన మూడో లైన్‌ను అధికారులు వినియోగించుకున్నారు. మంగళవారం ఉదయం వందలాది మంది కార్మికులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కుంగిపోయిన ప్రాంతంలో మట్టి లెవలింగ్ చేసేందుకు జేసీబీలను తరలించి పనులు సాగిస్తున్నారు. కుంగిన ట్రాక్‌ను తొలగించి నూతన ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.


రైల్వేలో స్వచ్ఛత పక్వాడ ముగింపు


విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పదిహేను రోజుల పాటు రైల్వేలో కొనసాగిన స్వచ్ఛత పక్వాడ ముగిసింది. మంగళవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో డీఆర్ఎం ఎం.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 15 రోజుల వ్యవధిలో డివిజన్ వ్యాప్తంగా 500 కిలోమీటర్ల రైల్వేట్రాక్‌ని శుభ్రపరిచినట్లు తెలిపారు. అలానే 4,710 మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను అప్పగించామన్నారు. మరోవైపు స్వచ్ఛతపై పిల్లల్లో అవగాహన పెంచేందుకు అనేక పోటీలు, కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. డివిజన్‌లోని 56 రైల్వేస్టేషన్లలో నిత్యం స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేశామని, దాదాపుగా 4 వేల మంది ఈ పక్షం రోజుల పాటు శ్రమదానంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. 55 రైళ్లలో తనిఖీలు నిర్వహించి అపరిశుభ్రంగా మారుస్తున్న 23 మందికి జరిమానా విధించామన్నారు. మొత్తంగా 10 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించామని, సదస్సులు, వెబినార్లలో 1200 మంది పాల్గొన్నారని చెప్పారు. స్వచ్ఛత పక్వాడ ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను డీఆర్ఎం ప్రదానం చేశారు.

22న విధుశేఖర భారతి మహాస్వామి రాక

గుంటూరు, కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శారదా పీఠాధిపతులు విధుశేఖర భారతి మహాస్వామి వచ్చే నెల 22, 23 తేదీల్లో గుంటూరుకు రానున్నట్లు పీఠం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావుని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నవంబరు నెలలో జరిగే విజయ యాత్రలో భాగంగా స్వామిజీ గుంటూరు వస్తున్నారని, స్వామిజీని కలిసి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఈ నెల 17 నుంచి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో స్వామిజీ విజయ యాత్ర జరుగుతుందని, అందులో భాగంగా వచ్చే నెల 13న ఆంధ్రాలోకి వస్తారని తెలిపారు. తొలుత తిరుపతికి చేరుకుంటారని, అక్కడ నుంచి ఆంధ్రాలోని పలు ప్రాంతాల్లో స్వామిజీ విజయ యాత్ర కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 22, 23 తేదీల్లో స్వామిజీ గుంటూరులోనే ఉంటారని వారు చెప్పారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధులతోపాటు ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓవీ రమణ పాల్గొన్నారు.


డీజీపీ ద్వారక తిరుమలరావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న శృంగేరి పీఠం ప్రతినిధులు, డాక్టర్ ఓవీ రమణ

ఆడిట్ రికార్డుల పరిశీలన

గుంటూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐదో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిషత్ బడ్జెట్, సంవత్సరిక లెక్కలు, ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్, ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎంపీఎస్ పద్మారావు, కె.కృపారావు, తాక్విద్దీన్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, ఏవోలు డి.రామకోటయ్య, జె.శోభారాణి, నాగరాజు ఫైనాన్స్ కమిషన్ సభ్యులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.


డిప్యూటీ సీఈవోతో సమావేశమైన రాష్ట్ర ఐదో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు

నేటి నుంచి నారా చంద్రబాబు నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అభినయ థియేటర్ ట్రస్ట్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నారా చంద్రబాబు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజూ రెండు నాటిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ప్రదర్శనల్లో భాగంగా బుధవారం సాయంత్రం శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం, శ్రీకాకుళం జిల్లా వారిచే కొత్త పరిమళం, కేజేఆర్, కల్చరల్ అసోసియేషన్ సికింద్రాబాద్ వారిచే సాహితి సూక్తం, గురువారం సాయంత్రం పూర్ణదయ ఆర్ట్స్ చీరాల వారిచే నేనేం చేసుకుంటాను, సాయి కార్తీక్ క్రియేషన్ కాకినాడ వారిచే ఎడారిలో వానచినుకు, శుక్రవారం సాయంత్రం కళాంజలి, హైదరబాదు వారిచే రైతేరాజు, శృంగార వల్లభ ఆర్ట్స్ తిరుపతి వారిచే కబ్జా నాటిక ప్రదర్శనలు జరుగుతాయని వివరించారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న చెస్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లీలావతి మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్-15 బాల, బాలికల చదరంగం పోటీలు స్థానిక గోరంట్ల, నెక్స్‌జెన్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను పాఠశాల కో ఆర్డినేటర్లు లక్ష్మీగాయత్రి, శ్రీకాంత్, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, స్టేట్ జాయింట్ కార్యదర్శి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దేవుళ్ల పేర్లు వద్దు


బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్

గుంటూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం షాపులకు వివిధ మతాలకు చెందిన దేవుళ్ల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం గుంటూరు నగరంలోని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన మద్యం పాలసీ టెండర్లు, లాటరీల ప్రకారం ఈ నెల 16వ తేదీ నుంచి నూతన మద్యం షాపులు ప్రారంభమయ్యే సందర్భంలో అధికారులు అప్రమత్తం కావాలని కోరారు. 2014 - 2019 వరకు ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మద్యం షాపులకు దేవుళ్ల పేర్లు పెట్టకూడదని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. అదే జీవోను ఈ ప్రభుత్వంలో కూడా కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని, తద్వారా వివిధ మతాల భక్తుల మనోభావాలను, ఆధ్యాత్మికత గౌరవాన్ని చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వివిధ మతాల ప్రార్థనాలయాలు, ప్రార్థన స్థలాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద షాపులు ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి మృతి


నాగేంద్రం (ఫైల్ ఫొటో)

మాచర్లటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ బుట్టి నాగేంద్రం మృతి చెందారు. నాగేంద్రం పట్టణంలోని రింగురోడ్డులో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఈమె ఇటీవల బాపట్ల నుంచి మాచర్లకు బదిలీపై వచ్చారు. మంగళవారం అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో తాము నివాసముంటున్న టెర్రస్ నుంచి కిందకు చూస్తూ ప్రమాదవశాత్తూ కిందకి పడిపోయింది. కుమారుడు వెంకటేష్ తల్లి నాగేంద్రంను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.ప్రభాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరికి జైలు.. ఇద్దరికి జరిమానా

గురజాలటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం గురజాల పట్టణంలో సీఐ భాస్కర్ ఆధ్వర్యాన డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ తీర్పునిస్తూ జిల్లెల్ల శ్రీనివాసరావు, షేక్ సుభానికి రూ.10 వేల చొప్పున జరిమానా, దుర్గారావుకు 15 రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ భాస్కర్ తెలిపారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36,250 క్యూసెక్కులు

తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3,572 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 39,822 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3,572 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. కాగా మహానాడు, సుందరయ్యనగర్ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, నదిలోకి వెళ్లొద్దని తహసీల్దార్ సూచించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,560 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,798 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా దీనిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

35,674 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 38,191 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,674 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,325 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8700	16000	334	8500	14500
నెంబరు. 5	9500	13500	నెంబరు. 5	12500	12500
273	11000	16000	273	11000	13000
341	8000	16500	341	9000	16000
4884	12000	15000	4884	13000	14500
సూపర్ 10	--	--	సూపర్ 10	14900	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18500	తేజ	9200	18300
బ్యాడిగి	9500	15000	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9500	13000	దేవనూరు డీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

రేషన్ షాపును తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు


రేషన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్

గుంటూరు సిటీ, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కన్నావారితోటలో ఉన్న రేషన్ షాపును విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాప్ నెంబర్ 159లో స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎస్పీ డి.సూర్య శ్రావణ కుమార్ స్వయంగా పాల్గొన్నారు. విద్యానగర్‌లో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని ఆయన పరిశీలించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పి.శివాజీ, డిప్యూటీ తహసీల్దార్ ఎ.శివశంకర్ పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులపై మండిపడ్డ ఈవో

● ఈవో వ్యవహారంపై భక్తులు డీసీకి ఫిర్యాదు


భక్తులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఈవో

గుంటూరు, కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 15: నగరంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఈవో పాదర్తి దుర్గారావు తీరుపై దేవదాయ శాఖ గుంటూరు డీసీ కె.బి శ్రీనివాసరావుకు భక్తులు ఫిర్యాదు చేశారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. గుంటూరు చెందిన దాతలు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని పెట్టారు. ఆ కార్యక్రమంలో తన పేరు లేకుండా పంపిణీ చేస్తున్నారనే ఆగ్రహంతో ఈవో మరింతగా రెచ్చిపోయారు. ఈ ప్రోగ్రాం ఎవరికి చెప్పి ఏర్పాటు చేశారని ఆయన మండిపడ్డారు. దీంతో భక్తులు ఈవో తీరుపై డీసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై డీసీని వివరణ కోరగా విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగన్ ముఠాను అండాసెల్‌లో వేయాలి : కనపర్తి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అడ్డగోలు మద్యం విధానంతో నిరుపేద మద్యం ప్రియుల మరణాలకు కారణమైన వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి, ఎంపీలు విజయసాయిరెడ్డి, మిధున్‌రెడ్డిలను అండా సెల్‌లో వేసి కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండా సెల్‌లో వేయాల్సింది ప్రొఫెసర్ సాయిబాబ లాంటి పోరాటయోధులను కాదని, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్ఏ)తో తయారు చేయాల్సిన మద్యాన్ని, కేవలం రెక్టిఫైడ్ స్పిరిట్‌తో తయారుచేసి నిరుపేద మద్యం ప్రియుల కుటుంబాలలో మరణ మృదంగానికి కారకులైన నీచులను ఆ జైళ్లలో వేయాలన్నారు. కేంద్ర సర్వీసుల నుంచి ఏరికోరి తమ సామాజికవర్గం వారైన వాసుదేవరెడ్డి, వెంకటరెడ్డి, ధర్మారెడ్డిలను ఆయా శాఖల్లో డిప్యుటేషన్ మీద నియమించుకొని సహజ సిద్ధమైన సంపదను అడ్డగోలుగా దోచుకున్న ఆర్థిక ఉగ్రవాది జగన్‌రెడ్డి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనం సొమ్ముతో జగన్ సోకులు : మన్నవ

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జనం సొమ్ముతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సోకులు పోయాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులిచ్చి పేటీఎం బ్యాచ్ చేత వీరుడు, శూరుడు అని ప్రచారం చేయించుకునే జగన్‌రెడ్డి తాను కట్టుకున్న తాడేపల్లి ప్యాలెస్‌లో ఐదేళ్ల పాటు పిల్లిలా భయం భయంగా బతికాడు అనేది పచ్చి వాస్తవమని మోహనకృష్ణ అన్నారు. ప్రజల సొమ్ము దోచుకున్న దోపిడీ దొంగ జగన్, తాను దాక్కోడానికి ఇంటి చుట్టూ ఎత్తైన ఐరన్ ఫెన్సింగ్ నిర్మాణం కోసం రహస్య జీవో ఇచ్చుకొని ఏకంగా రూ.12.85 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశాడంటే ప్యాలెస్ పులి ఎంతలా భయపడ్డాడో అర్థం చేసుకోవచ్చునని విమర్శించారు. జగన్ జల్సా ఖర్చులను ప్రభుత్వం వడ్డీతో సహా వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి కృషి అభినందనీయం : దేగల

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రజల కలను సాకారం చేసిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి అభినందనీయమని టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వైద్యరంగంతో పాటు సమగ్ర అభివృద్ధిపై పెమ్మసాని దృష్టి పెట్టారని అన్నారు. నాలుగు లైన్ల విస్తరణతో శంకర్ విలాస్ రైల్వే వంతెన నిర్మాణ పనులు, గుంటూరు-నల్లపాడు రైల్వే సెక్షన్‌లో నాలుగు లైన్లు ఏర్పాటుకు కేంద్రం నుంచి రూ.98 కోట్లు సాధించిన ఆయన కృషి మరువలేనిదని అన్నారు. ఆయనకు దేగల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నేరవేర్చాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం మంగళవారం పాత గుంటూరు, సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పునరుద్ధరించకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఖాసిం వలి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రవీంద్రనగర్, శ్యామలానగర్, స్తంభాలగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి4 సెక్షన్ ఏఈ కె.అంజనీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలానే పట్టాభిపురం డీఆర్ఎం ఆఫీస్ రోడ్డులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి8 సెక్షన్ ఏఈ జి.నాగరాజకుమార్ పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట వై జంక్షన్ సమీపంలోని నారాయణ కోల్డ్ స్టోరేజ్ వద్ద అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. మృతుడి పేరు కృష్ణ (35) అని స్థానికుల ద్వారా తెలిసింది. స్టోరేజ్ ఎదురు గల షాప్స్ వద్ద మృతదేహం పడి ఉందని పోలీసులు తెలిపారు. ఇతను శ్రీకాకుళంకు చెందినవాడని తెలిసిన వారు చెప్పారని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో ఉంచారు. మృతుని సమాచారం తెలిసినట్లయితే నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐని 86888 31376 నెంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.


కృష్ణ మృతదేహం

ఎన్టీఆర్ బస్టాండ్‌లో అధ్వాన పారిశుధ్యం


బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇటీవల వర్షాలతో పారిశుధ్యం మరింత దిగజారింది. బస్టాండ్ ఆవరణలో వ్యర్థాలు పేరుకుపోవటం, వర్షపునీరు నిల్వ ఉండటంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ముక్కు మూసుకుంటున్నారు. ఇక క్షేత్ర స్థాయిలో అధికారుల అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్యం వెరసి బస్టాండ్‌లో పారిశుధ్యంపై ప్రభావం చూపుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే పండుగల రోజులు బస్టాండ్‌లో ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటోంది. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు


అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి


అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత అణు విజ్ఞాన శాస్త్ర పితామహుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో యువత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకుంటే ఏ రంగంలోనైనా విజయం సాధించడం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో సుఖవాసి శ్రీనివాస్, మొవ్వా వేణు బాబు, యాకోబు, కదిరి సంజయ్, గుర్రం ప్రసాద్, రమణమ్మ, చింతకాయల రామారావు తదితరులు పాల్గొన్నారు

యువతకు ఆదర్శనీయుడు కలాం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం యువతకు ఆదర్శనీయుడని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువతకు ఆదర్శనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, పఠాన్ జమీర్, అంజనేయప్రసాద్, గాలి సతీష్, మల్లంపూడి శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

తరతరాలకు స్ఫూర్తి : డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అబ్దుల్ కలాం అని తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ కొనియాడారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం శనక్కాయల ఫ్యాక్టరీ వీధిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ శనక్కాయల అరుణ హాజరయ్యారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ శనక్కాయల అరుణ మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల రాజకుమారి, సురేష్ జైన్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలలో...

గుంటూరు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి యువతకు మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ స్ఫూర్తి ఆదర్శనీయమని జిఇ సంస్థ డైరెక్టర్ మాకినేని ఝుష్కర్ అన్నారు. పలకలూరులోని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అబ్దుల్ కలామ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సాంకేతికనైపుణ్యాలను మరింతగా పెంచుకుని భావి భారత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక పాల్గొన్నారు.

శ్రీ వికాస్ స్కూల్‌లో...

గుంటూరు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్ పరిధిలోని శ్రీవికాస్ స్కూల్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ విగ్రహానికి పాఠశాల డైరెక్టర్ దాసరి రాజా మాస్టారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో...

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యాలయంలో గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సాంబశివరావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ గౌస్ పీరా జోనల్ ఇంచార్జ్ షేక్ రఫీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హేమంత్ జైన్, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక శక్తులపై చర్యలు తీసుకుంటాం

● ఎమ్మెల్యే రామాంజనేయులు హామీతో దీక్ష విరమించిన లక్ష్మి

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు అరాచకాలు, అఘాయిత్యాలు, భూకబ్జాలు, బెదిరింపులు వంటి విద్రోహాలకు పాల్పడిన వైసీపీ అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పష్టం చేశారు. వారి ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వికాస్‌నగర్‌లో గత శనివారం నుంచి ఆదర్శ మహిళ మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి తన సన్నిహితులు, బంధువులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగిన విషయం విదితమే. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మంగళవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి ఆమె డిమాండ్లు న్యాయ సమ్మతమైనవని, ఆయా సమస్యలను ప్రభుత్వ పరంగా అన్ని విధాల పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సూచన మేరకు కోపూరి లక్ష్మి ఆమరణ నిరాహార దీక్షను విరమించారు.


లక్ష్మికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేయిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్న పెమ్మసాని : ఆళ్ల హరి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతరం శ్రమిస్తున్నారని జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. గుంటూరు శ్రీనివాసరావుతోటలో మంగళవారం కూటమి నేతలు పెమ్మసానికి క్షీరాభిషేకం చేశారు. హరి మాట్లాడుతూ పెమ్మసాని విజ్ఞప్తి మేరకు గుంటూరు శంకర్ విలాస్ రైల్వే వంతెన విస్తరణకు అనుమతులిస్తూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరి 98 కోట్ల నిధులు విడుదల చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు ధరణి, బండారు రవీంద్ర, మెహబూబ్ భాష, మాదాసు శేఖర్, రాజశేఖర్, చింతకాయల సాయి, కోలా మల్లి, సుబ్బారావు, బాలకృష్ణ, ఇల్లా చిరంజీవి, ములక్కాయ్ శేషు, మస్తాన్ వలి, కాసులు, స్వామి, కుమారస్వామి పాల్గొన్నారు

ఎన్‌సీసీ ఆర్‌డీసీకి సీతారామయ్య హైస్కూల్ విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సెక్రెటరీ విష్ణువర్ధన్ తదితరులు

గుంటూరు, కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4వ తేదీ నుంచి 13వ తేది వరకు 25 ఆంధ్ర-బెటాలియన్ వారు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంప్‌లో భాగంగా, ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు వివిధ విభాగాలలో పోటీలను నిర్వహించారు. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తంగెళ్ళ పల్లి బోసు అనుదీప్ కృష్ణ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి సికింద్రాబాద్‌లో జరుగబోయే ఆర్‌డీసీ(రిపబ్లిక్ డే పెరేడ్)కి ఎంపికయ్యాడని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ వాసిరెడ్డి శివనాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి వితరణ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ దేవరపల్లి రమేష్ కుటుంబానికి ఎస్పీ వితరణగా చేయూత కింది రూ.లక్షా 75 వేల చెక్కును అందించారు. గత నెల 18న రమేష్ అనారోగ్యంతో మరణించారు. మంగళవారం రమేష్ సతీమణి జ్యోతికి ఎస్పీ చెక్కును అందజేసారు. కార్యక్రమంలో మినిస్టీరియల్ సిబ్బంది రమాదేవి, పవన్, జిల్లా పోలీసు అసోసియేషన్ మెంబర్స్ కరిముల్లా, లక్ష్మణ్, హుస్సేన్, మైలా సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వానికి ధన్యవాదాలు : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రజల కల అయిన శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణను సాకారం చేసిన ఎన్డీఏ ప్రభుత్వానికి ఎమ్మెల్యే గల్లా మాధవి కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితోనే శంకర్ విలాస్ బ్రిడ్జి సాధ్యమైందని ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి పశ్చిమ ప్రజల తరుపున ఆమె ధన్యవాదాలు తెలిపారు.

'పశ్చిమ' అభివృద్ధికి తోడ్పాటునివ్వండి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృధికి సహకరించాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులును ఎమ్మెల్యే గల్లా మాధవి కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆమె కమిషనర్‌ని కలిసి పశ్చిమ నియోజకవర్గ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలు, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. వీటిలో ప్రధానంగా సంపత్ నగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు. సంఘ సంస్కర్తల విగ్రహాల ఏర్పాటు కోసం నియోజకవర్గంలో ఒక ఐలాండ్ ఏర్పాటు చేయాలన్నారు. గుజ్జనగుండ్లలోని నాయీబ్రాహ్మణ కాలనీలో 'బీసీ కమ్యూనిటీ హాల్' నిర్మాణానికి సహకరించాలన్నారు.

దేవేంద్రకు కమిషనర్ అభినందనలు

గుంటూరు, కార్పొరేషన్ అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన పారా స్విమ్మర్ దేవేంద్ర జాతీయ స్థాయి పారా ఈత పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ చాంబర్లో కోచ్ ఎస్కే ఖాజా మొహిద్దీన్, స్విమ్మర్ దేవేంద్రలను మంగళవారం కమిషనర్ అభినందించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 22 వరకు గోవాలో జరిగే జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో పాల్గొనేందుకు దేవేంద్ర అర్హత సాధించారని, అక్కడ కూడా ఉత్తమ ప్రదర్శన చూపాలని ఆకాంక్షించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకొని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలలో అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం పనులపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్లలో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాల పురోగతి లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హౌసింగ్ ఏఈలను సమన్వయం చేసుకొని సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీల ద్వారా ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇనుము అందుబాటులో ఉందని, ఇసుక సైతం సంబంధిత లే అవుట్లలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్లాబు దశలో ఉన్న ఇళ్లను లబ్ధిదారులు తక్షణమే పూర్తి చేసుకోనేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంజూరు చేసిన కిచెన్ గార్డెన్లు, టాయిలెట్లు రిపేర్లు, మంచినీటి సౌకర్యం, ఇంకుడుగుంతలు తదితర పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖల ద్వారా వెంటనే ప్రారంభించేలా ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, సీపీఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ జెవీఎస్ఆర్‌కెవీ ప్రసాద్, డ్వామా పీడీ వి శంకర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేటి నుంచి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

● కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు, కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 15: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం నుంచి 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టనున్నామని, అందుకు తగిన విధంగా స్పెషల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రజారోగ్య కార్మికులను ప్రాంతాలు, గృహాల వారీగా రేషనలైజేషన్, మ్యాపింగ్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, స్పెషల్ శానిటేషన్ పర్యవేక్షణ అధికారులు, ప్రజారోగ్య అధికారులతో స్పెషల్ డ్రైవ్ పై మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణకు, డ్రెయిన్ల శుభ్రానికి, రోడ్ల స్వీపింగ్‌కు తగిన విధంగా కార్మికులను, అందుకు అవసరమైన వాహనాలను మ్యాపింగ్ చేయాలన్నారు. నగరంలోని తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల వారీగా కమర్షియల్ వ్యర్థాల సేకరణకు టెండర్లు పిలవాలని ఈఈ సుందర్రామిరెడ్డిని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, స్పెషల్ శానిటేషన్ పర్యవేక్షణ అధికారులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం నిర్దిష్ట లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలి

గుంటూరు నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు, సొంతంగా నిర్మాణం చేసుకునే వారు డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసేలా హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, హౌసింగ్ లే అవుట్స్ ల్లో ఇళ్ళ నిర్మాణ పనుల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ తొలుత లే అవుట్స్ వారిగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను లే అవుట్ల వారీగా ఎమినిటి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, శ్రీనివాస్, ఉపా సెల్ పిఓ బాలాజీ బాష, హౌసింగ్ డిఈఈలు, ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

మణి హోటల్ సెంటర్ లో బ్రాందీ షాపును ఏర్పాటు చేయొద్దు

● ఎక్సైజ్ శాఖ ఈఎస్‌కి చర్చి పెద్దల ఫిర్యాదు

గుంటూరు, కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 15 : నగరంలోని పాత గుంటూరు నందివెలుగు రోడ్డు మణి హోటల్ సెంటర్‌లో బ్రాందీ షాప్ ఏర్పాటు చేయొద్దని గుంటూరు ఎక్సైజ్ శాఖ ఈఎస్ అరుణ్ కుమార్‌కి చర్చి పెద్దలు మంగళవారం ఫిర్యాదు అందజేశారు. మణి హోటల్ సెంటర్లో వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చర్చి, మసీదు ఉన్నాయన్నారు. ఎంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మూడు బ్రాందీ షాపులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, వాటిని ఇక్కడ ఏర్పాటు చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం షాపుల ఏర్పాటును విరమించుకోకపోతే నేటి నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రేపటి నుంచి ఏఎన్‌యూ
దూరవిద్య పరీక్షలు

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా యూజీ, పీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఈ మేరకు మంగళవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ దూరవిద్య పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేందుకు చీఫ్ సూపరింటెండెంట్ల సహకారం కీలకమన్నారు. అలాగే దూరవిద్య కేంద్రానికి 10 పీజీ సైన్స్ కోర్సులకు అనుమతి వచ్చిందని త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దూరవిద్యా కేంద్రం పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి. రామచంద్రన్ మాట్లాడుతూ దూరవిద్య పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా పరీక్షల నిర్వహణకు ప్రతి పరీక్షా కేంద్రంలో అబ్జర్వర్, రీజనల్ కోఆర్డినేటర్, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, అకడమిక్ కౌన్సిలర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ కరీముల్లా సస్పెన్షన్

- వెంకటాచలం పీఎస్‌లో బంగారం మాయం
- నివేదిక ఇచ్చిన సీఐ, డీఎస్పీ
- చర్యలు తీసుకున్న ఐజీ త్రిపాఠి

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో జిల్లాలో పనిచేసి ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న వివాదాస్పద ఎస్‌ఐ కరీముల్లా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ్ త్రిపాఠి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంకటాచలం ఎస్‌ఐగా కరీముల్లా పనిచేస్తున్న సమయంలో ఓ కేసుకు సంబంధించి సుమారు 800 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. అయితే ఈ బంగారం పోలీసు స్టేషన్ నుంచి మాయమైంది. ఎస్సై ఆధీనంలో ఉండాల్సిన బంగారం మాయమైనట్లు ఏడాది క్రితమే వెలుగులోకి వచ్చింది. కానీ నాడు పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారాక వెంకటాచలం స్టేషన్‌కు కొత్త సీఐగా సుబ్బారావు బాధ్యతలు తీసుకున్నారు. చార్జ్ తీసుకున్న సందర్భంగా అన్ని కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను ఆయన పరిశీలించుకున్నారు. కానీ బంగారం మాత్రం స్టేషన్‌లో లేకపోవడంతో వెంటనే ఈ విషయాన్ని నివేదిక రూపంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన కూడా వెంకటాచలం స్టేషన్‌లో బంగారం మాయమైనట్లు నిర్ధారించి, అందుకు అప్పటి ఎస్సైను బాధ్యుడిగా నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నివేదికలను జిల్లా ఎస్పీ గుంటూరు రేంజ్ ఐజీకు పంపారు. వీటిని పరిశీలించిన ఐజీ.. ఎస్సై కరీముల్లాను సస్పెండ్ చేశారు. అయితే ఎప్పుడో రెండేళ్ల క్రితం బంగారం మాయమైతే ఇన్నాళ్లూ అక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారంపై ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను వివరణ కోరగా ఎస్సైను సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు.

కౌలు కోసం రైతుల పాట్లు!

ఒక ఏడాది కౌలే చెల్లించిన ప్రభుత్వం

రెండో ఏడాది బకాయిపై స్పష్టత కరువు

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల కౌలు కష్టాలు కూటమి ప్రభుత్వం వచ్చినా తీరడం లేదు. గత ప్రభుత్వం కక్షకొద్దీ ఆపిన రైతుల కౌలు ఈనాటికీ వారికి దక్కడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఒక ఏడాది కౌలు మాత్రమే చెల్లించడంతో రైతులు నిరాశకు గురయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టింది. గడిచిన ఐదేళ్లలో కోర్టు మెట్లెక్కకుండా రైతులకు కౌలు దక్కిన దాఖలాలే లేవు. చివరికి కోర్టు తీర్పులు, ఆదేశాలను కూడా పెడచెవిన పెట్టిన వైసీపీ ప్రభుత్వం ఆఖరి రెండేళ్లల్లో ఒక్క రూపాయి కూడా కౌలు చెల్లించలేదు. రెండేళ్లకు కలిపి రూ.400 కోట్ల వరకూ రైతులకు బకాయి పెట్టింది. ఇప్పుడు ఆ భారమంతా కూటమి ప్రభుత్వంపైనే పడింది. రెండేళ్ల బకాయిలు అందుతాయనుకుంటే.. కూటమి ప్రభుత్వం గత నెల 16న ఒక ఏడాది కౌలే చెల్లించింది. ఈ ఏడాది 10 శాతం పెంచి, రూ.210 కోట్ల కౌలు చెల్లించాల్సి ఉంది. మరోవైపు గత మూడేళ్లుగా అసైన్డ్ రైతులకు కలగా మారిన కౌలు ఎట్టకేలకు వారికి దక్కింది. సీఐడీ విచారణ పరిధిలోలేని 1400 మంది రైతులకు మూడేళ్ల కౌలు చెల్లించేసింది. దీంతో మిగిలిన రైతులకు కూడా తక్షణమే బకాయి కౌలు విడుదల చేయాలని రైతులు కోరుకుతున్నారు.

కూటమి ప్రభుత్వం పేదల పెన్నిధి: వర్ల

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కర్లపూడి వెంకాయమ్మ... గుంటూరు జిల్లా కంతేరుకు చెందిన ఒంటరి మహిళ. కిడ్నీ సమస్యతో బాధపడుతున్నానని, తమకు ఇల్లు కూడా లేదని, తన కుమారుడికి ఉపాధి కల్పించాలని 45 రోజుల క్రితం సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆమెకు సాయం చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆమెకు రూ.1.80 లక్షలతో ఇల్లు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. అలాగే ఆమె కుమారుడు వంశీకి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సబార్డినేట్ ఉద్యోగం ఇస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎన్డీయే ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని చెప్పడానికి వెంకాయమ్మ కుటుంబానికి చేసిన సాయమే నిదర్శనం. ఈ సందర్భంగా వెంకాయమ్మకు, వంశీకి ప్రభుత్వ ఉత్తర్వులను వర్ల అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి పాతర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెనక్కి నడుద్దామా..

బ్యాక్ వాకింగ్‌తో శక్తివంతంగా తయారవుతారు. మామూలుగా ముందుకు ఎంత వేగంతో నడుస్తారో వెనక్కి కూడా అంతే వేగంగా నడిస్తే 40 శాతం క్యాలరీలు ఖర్చు అవుతుందని, శరీరంలో కొవ్వు తగ్గుతుందని వెస్ట్ లండన్ యూనివర్సిటీ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. రోజూ 10 నుంచి 30 నిమిషాలు వెనక్కి నడిస్తే వారంలో 2-4 సార్లు జాగింగ్ చేసిన దాంతో సమానమని, శరీరం దృఢంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.





వెనుకడుగు అంటే జీవితంలో వెనకపడిపోవడం అంటారు. కానీ ఆరోగ్యం విషయంలో వెనకడుగు వల్ల ఎంతో మేలు జరుగుతుంది. సాధారణంగా వాకింగ్ అనేది ఎంతో ఆరోగ్య కరం. దీర్ఘకాలిక రోగాలు రాకుండా కొందరు నడక సాగిస్తుండగా.. మరికొందరు రోగా లు తగ్గేందుకు వాకింగ్ చేస్తుంటారు. నేటి ఆధునిక జీవనంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు వయస్సు తారతమ్యాలు లేకుండా వాకింగ్, జాగింగ్ అనేది నిత్యకృత్యంగా మారింది. వాకింగ్ మాన వ జీవనంలో ఒక భాగమైందంటే ఆశ్చర్యం కాదు. అయితే ఈ వాకింగ్‌లో కూడా బ్యాక్ వాకింగ్ అనేది అత్యుత్తమ మని.. రకరకాల అనారో గ్యా లకు ఇదే దివ్య ఔషధం లాంటిదని వైద్యులు సూచిస్తున్నారు.

- బ్యాక్‌వాకింగ్‌తో ఎంతో మేలు
- అదుపులో కొలెస్ట్రాల్, బీపీ, షుగర్
- రోజుకు 10-30 నిమిషాలతో ఆరోగ్యం
- వెనుకడుగులతో రక్త ప్రసరణ వేగవంతం
- బ్యాక్ రన్నింగ్ అలవరుచుకోవాలని సూచన

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొన్ని సార్లు వెనుక అడుగువేయాలని పెద్దలు చెబుతారు. ఇదే విషయాన్ని ఆరోగ్యంలో కూడా పాటించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాకింగ్‌తో కొలెస్ట్రాల్, అధిక బరువు, బీపీ, షుగర్ నియంత్రణలో ఉంటాయి. ముఖ్యంగా గుండె క్రియాశీలకంగా పనిచేస్తుంది. ఈ విషయాలు అందరికీ తెలిసిందే. కానీ బ్యాక్‌వాకింగ్ వల్ల శరీరా నికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబు తున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా క్యాలరీలు ఖర్చు చేయించే వ్యాయామం వాకింగ్ మాత్రమే. వాకింగ్ వల్ల శరీరా నికి ఎన్నో ప్రయోజనాలు సమకూరుస్తుంది. బ్యాక్ వాకింగ్ వల్ల సాధారణ వాకింగ్ చేసిన దాని కంటే అదనపు ఆరోగ్య ప్ర యోజనాలు ఉన్నాయి. బ్యాక్ వాకింగ్ అనేది మెదడుకు సవాలు లాంటిదని వైద్యులు సూచిస్తున్నారు. వాకింగ్ సమ యంలో మనం ఇతర ఆలోచనలపై మెదడు ఉంటుందని, కానీ బ్యాక్ వాకింగ్‌తో దృష్టి, చలనం, గ్రహణం వంటి విషయాలను మెదడు గమనిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

ఎలా మొదలుపెట్టాలి..

వెనక్కి నడవడం అనుకున్నంత సులభం కాదు. ముందుగా రోజూ చేసుకునే వ్యాయామంలో బ్యాక్ వాకింగ్‌ను ఓ భాగంగా చేసుకోవాలి. తొలుత ఇంట్లో లేదా ఆవరణలో వెనక్కి నడవడం మొదలు పెట్టాలి. వెనక్కి నడిచేటప్పుడు పూర్తి రక్షణ చూసుకోవాలి. ముఖ్యంగా వెనక్కి నడిచేటప్పుడు శరీరం వంగిపోతుందేమో గమనించాలి. భుజాల మీదగా చూసుకుంటే ఆ విషయం తెలుస్తుంది. కానీ ప్రతిసారి తల వెనక్కి తిప్పకూడదు. ఎందుకంటే తల నరాలు పట్టేసే ప్రమాదం ఉంది. తల, ఛాతి, ఇతర అవయువాలు నిటారుగా ఉండాలి. వెనక్కి అడుగు వేసే సమయంలో బొటనవేలు ముందు నేలకి తాకిన తర్వా త పాదాన్ని తాకించాలి. ప్రతి అడుగు ఇలానే ఉంచాలి. బొటన వేలి నుంచి మడమ వరకు పాదం ఎలా పడుతుం దనేది జాగ్రత్తగా గమనిస్తుండాలి. అప్పుడే రక్త ప్రసరణ సులభతరమై, చెడు రక్తం నిల్వ లేకుండా ఉంటుంది.

బ్యాక్ రన్నింగ్ కూడా...

వెనక్కి నడవడం అలవాటు చేసుకున్న తర్వాత రన్నింగ్ అలవాటు చేసుకోవాలి. వెనక్కి పరిగెత్తడం వల్ల మోకాళ్లు బాగా పని చేసి కండరాల శక్తి పెరుగుతుంది. దీని వల్ల కండరాల పనితీరు మెరుగు పడి, గాయాల నుంచి త్వరగా కోలుకుంటారు. అంతేగాక ఈ మధ్య ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్న మడమ నొప్పులు నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల, కండరాల కదలికలో మార్పు వస్తుంది. వెనక్కి నడవడం వల్ల శరీర భంగిమ(పోశ్చర్) మెరుగు పడుతుంది. బ్యాక్ రన్నింగ్‌లో శరీరంలో లుంబార్ స్పైన్‌కి సపోర్టుగా ఉండే కండరాలు వాడకం జరుగుతుంది. దీంతో లోయిర్ వెన్నునొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

చిన్న అడుగులతోనే..

చిన్న అడుగులతోనే బ్యాక్ వాకింగ్ ప్రారంభించా లి. ఎక్కువ సేపు చిన్న అడుగు లు వేస్తే శరీరం ఉత్తేజమవుతుంది. అంతేగాక మోకాళ్ల కింద భాగాల్లో కండరాల బలం పెరిగి కీళ్ల మీద భారం తగ్గుతుంది. వెనక్కి అడుగు వేయడం వల్ల శరీరం స్థిర త్వం, నిలకడ మెరుగు పడుతుంది. దీంతో శరీర సమతుల్యత మెరుగవుతుంది. ము ఖ్యంగా కుర్చొని పనిచేసే ఉద్యోగులకు, దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు, పెద్దలకి, మహిళలకు బ్యాక్ వాకింగ్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆస్టియో అర్థరైటిస్ సమస్యల వల్ల మోకాళ్ల నొప్పులతో ఇబ్బంది ప డుతున్న వారికి, చెడు రక్తం ప్రవ హించే వారికి ఈ నడక మేలు చేస్తుంది.

నడక కష్టతరం

బ్యాక్ వాకింగ్ కష్టతరమైన ప్రక్రియ అని నిపుణులు చెబుతున్నారు. ఈ వాకింగ్ సమయంలో దృష్టి, శరీరం కదలికలో వేగం గమనించాలి. చాలామంది ఇతర వ్యాపకాలు గురించి ఆలోచిస్తూ వాకింగ్ చేస్తుంటారు. కొంత మంది సంగీతం వింటూ వాకింగ్ చేస్తుంటారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. వాకింగ్‌ను చిత్త శుద్ధిగా అలవాటు చేసుకున్న వారికే మాత్ర మే బ్యాక్ వాకింగ్ ప్రారంభించాలి. తొలుతే వెనక్కి అడుగుల వేయడం వల్ల మెదడుపై అదనపు భారం పడుతుంది.

- బ్యాక్ వాకింగ్‌తో శరీరంలో కండరాలు క్రియాశీలకంగా పనిచేస్తాయి. ముఖ్యంగా క్రీడా కారులకు, మహిళలకు, వృద్ధులకు ఈ వ్యాయా మం మంచిది. ఎందుకంటే వెనక్కి అడుగువే య డంతో శరీరంలో స్థిరత్వం, నిలకడ ఏర్పడుతుంది. వా కింగ్, బ్యాక్ వాకింగ్‌లతో గుండెకు ప్రయోజనాలు వస్తా యి. యాంత్రిక జీవితంలో ఈ వ్యాయామం మంచిది.

\- డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి

నిత్యం చేయాలి

చాలామంది వాకింగ్, బ్యాక్ వాకింగ్ తొలుత ప్రారంభించి, అ తర్వాత అలవాటును దూరం చేసు కుంటారు. అలాకాకుండా నిత్యం చేస్తూనే ఉండాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. వెనక్కి అడు గులు వేయడం కష్టమే, కానీ కొన్ని రోజుల తర్వాత సులభమవుతుంది. కాకపోతే బ్యాక్ వాకింగ్ సరైన స్థలం కావాలి. కొన్ని రోజుల తర్వాత బరువులను లాగుతూ వెనక్కి నడవాలి. ఆ తర్వాత నెమ్మదిగా బరువు పెంచి నడవాలి. దీంతో మోకాళ్ల కండరాలు సాగుతాయి. బాగా అలవాటైన తర్వాత వేగం పెంచోచ్చు. ట్రెడ్ మీల్ మీద కూడా బ్యాక్ వాకింగ్ చేయోచ్చు. బ్యాక్ వాకింగ్ చేసేవారు తొలుత 20 మీటర్లు కంటే ఎక్కువ దూరం పెట్టుకోవద్దు. నెమ్మదిగా మొదలు పెట్టి అందులో సులువు దొరికకా వెనక్కి స్పీడ్‌గా నడవొచ్చు.

అధిక బరువుకు చెక్...



బ్యాక్ వాకింగ్‌ను అలవాటు చేసుకుంటే అధిక బరువు సమస్య నుంచి బయట పడ తారు. స్ట్రోక్ లేదా న్యూరలాజికల్ ఇబ్బందుల వల్ల చాలామంది సమతుల్యత తప్పి పడిపోతుంటారు. వెనక్కి నడవడంలో వల్ల ఈ సమస్యను ముందుగానే గుర్తించే అవకాశం కలుగుతుంది. నడక దిశ మార్చడం వల్ల చికిత్సాపరమైన లాభాలు కూడా ఉంటాయి.

పంచాయతీల కోసం పైరవీలు

(ఐదవపేజీ తరువాయి)

కార్యదర్శులు పాత స్థానంలోనే కొనసాగుతున్నారు. గుంటూరు జిల్లా నుంచి పల్నాడుకు బదిలీ అయిన గ్రేడ్-5 కార్యదర్శులు అక్కడికి వెళ్లేందుకు సుముఖంగా లేరు. బదిలీ స్థానం మార్పించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

వారికోసం నిబంధనలకు నీళ్లు...

గ్రామ, వార్డు సచివాలయంలో నియమించిన పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్-5గా సంబోధిస్తున్నారు. గ్రేడ్-5లో ఉన్న కార్యదర్శులు ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీలో పోస్టింగ్‌ను దక్కించుకునేందుకు లాబీయింగ్ మొదలు పెట్టినట్లు విమర్శలున్నాయి. వీరికి అనుగుణంగా డీపీవో కార్యాలయంలోని ఉద్యోగులు అధిక ఆదాయం కలిగిన పంచాయతీలను గ్రేడ్-5లో చూపించినట్లు సమాచారం. ఉదాహరణకు గుంటూరు రూరల్ మండలంలోని ఓబులునాయుడు పాలెం, గొర్లవారిపాలెం ఆదాయ పరంగా పెద్దవి. వాటిని గ్రేడ్-4 అడిషినల్ అని చూపించారు. ఈ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది.

గ్రేడ్-4 అడిషినల్ అని..

వాస్తవానికి జీవో 84 ప్రకారం 4 గ్రేడ్లు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 442పై చిలుకు గ్రామ, వార్డు సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్ ద్వారా ప్రత్యేక కోడ్‌ను కేటాయించింది. ఆ కోడ్ ఆధారంగానే వారికి జీతాలు పడతాయి. ఒక వేళ గ్రేడ్- 5 కార్యదర్శిని వేరే గ్రేడ్‌లో నియమిస్తే జీతాల చెల్లింపు వ్యవహారం మెలిక పడుతుంది. ఈ నేపథ్యంలోనే అధికారులు గ్రేడ్ల వారీగా నియమంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయినా పట్టించుకోని కొందరు పెద్ద పంచాయతీలపై కన్నేశారు. వాటికోసం జిల్లా కార్యాలయంలో భారీగా మామూళ్లు ముట్టజెపుతున్నారు. వారికి లబ్ధి చేకూర్చేందుకు గ్రేడ్-4 అడిషినల్‌అని ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. జీవో 394/2010 ప్రకారం వివరాలు పంపమని అడుగుతుండగా ప్రొఫార్మాలో గ్రేడ్-1, 2, 3, 4, 5, గ్రేడ్-4 అడిషినల్ అని పేర్కొన్నారు. అయితే 2010లో గ్రేడ్-5, గ్రేడ్-4 అడిషినల్ కార్యదర్శులు ఎక్కడ ఉన్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బదిలీల వ్యవహారంలో జరిగిన అవినీతిపై డీపీవో కార్యాలయంలో కొందరు ఉద్యోగులపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. సీఎం, డిప్యూటీ సిఎం దృష్టికి కూడా వీరి అవినీతి వ్యవహారం తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది.

చాలామందికి అందని ఉత్తర్వులు

సెప్టెంబరు 23 నుంచి బదిలీలపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా చాలామంది పంచాయతీ కార్యదర్శులు తమకు బదిలీ ఉత్తర్వులు అందలేదని చెబుతున్నారు. డీపీవో కార్యాలయం దగ్గరకు వెళ్లి ఇద్దరు ఉద్యోగులను కలిస్తేనే ఉత్తర్వులు ఇస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రేడ్-5కి చెందిన కొందరు కార్యదర్శులు ప్రజాప్రతినిధులను కూడా పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రేడ్ విషయం చెప్పకుండా సిఫార్సు లేఖలు తీసుకువచ్చి వాటి ఆధారంగా పైరవీలు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలు కూడా ఇంకా జరుగుతూనే ఉన్నాయి. నచ్చిన స్థానం కోసం పలువురు భారీ ఎత్తున చేతులు తడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

భూములు దున్నేసుకుంటాం!

అమరావతి అసైన్డ్ రైతుల హెచ్చరికలు

నాట్ ట్యాలీడ్ జాబితాతో మూడేళ్లుగా అందని కౌలు

కౌలు చెల్లించినట్టు సంతకాలు చేయాలని అధికారుల ఒత్తిడి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'రాజధాని కోసం భూములిచ్చిన మాపై సీఐడీ విచారణ చేస్తారా? విచారణ పేరుతో మూడేళ్లుగా కౌలు ఆపేస్తారా? భూములిచ్చిన పదేళ్ల తర్వాత కూడా న్యాయం చేయరా? సమస్య పరిష్కరించకుండా పరిష్కారమైనట్లు సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తారా? ఈ బాధలు మాకొద్దు! మా భూములు మేమే దున్నేసుకుంటాం' అని రాజధాని అమరావతి అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారులకు అడ్డం తిరుగుతున్నారు. అసైన్డ్ రైతుల భూములపై గత వైసీపీ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. విచారణ ప్రక్రియ మొదలవగానే సీఐడీ అధికారులు ఆ భూములను నాట్ ట్యాలిడ్ జాబితాలో పెట్టారు. దీంతో మూడేళ్లుగా కౌలు చెల్లింపులు ఆపేశారు. తాజాగా 1400 మంది రైతులను ట్యాలిడ్ జాబితాలో చేర్చారు. వారికి కౌలు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే మరో 1,650 ఎకరాల భూమి, అందుకు సంబంధించిన రైతులు వివరాలు ఇంకా నాట్ ట్యాలిడ్ జాబితాలోనే ఉన్నాయి. ఫలితంగా వీరికి కౌలు వచ్చే అవకాశం లేకుండా పోయింది. మూడేళ్లుగా కౌలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయి, అప్పులపాలైన రైతులు.. కూటమి ప్రభుత్వంపైనే ఆశ పెట్టుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వారి సమస్య మరింత తీవ్రమయింది.

సీఆర్డీఏ అధికారుల ఒత్తిడితో రైతుల సతమతం

కౌలు రాక ఇబ్బందుల్లో ఉన్న రైతుల పట్ల సీఆర్డీఏ అధికారుల తీరు వారిని మరింత మనోవ్యధకు గురి చేస్తోంది. నీరుకొండ, కురగల్లు రైతులు కౌలు కోసం ప్రభుత్వానికి వినతులు పెట్టుకున్నారు. ఆ వినతులతో సమస్య పరిష్కారం కాకపోగా అవే కొత్త సమస్యగా మారాయి. నిర్ణీత సమయంలోపు వినతులను క్లోజ్ చేయాల్సి ఉండడంతో అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. సీఎంవో కార్యాలయం, సీఆర్డీఏ కమిషనరేట్ నుంచి ఒత్తిడి వస్తోందని, సమస్య పరిష్కారం అయినట్లు సంతకాలు చేయాలని అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. సమస్య పరిష్కారం కాకుండా సంతకాలు చేసేది లేదని రైతులు అడ్డం తిరిగారు. నాలుగు రోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. దీంతో సమస్య పరిష్కరించకుంటే పొలాల్లో వేసిన హద్దురాళ్లు పీకేసి పొలాలు సాగు చేసుకుంటామని రైతులు తెగేసి చెబుతున్నారు.



విదేశీ నేస్తాలు వచ్చేశాయ్

- పక్షుల కిలకిలరావాలతో అలరారుతున్న ఉప్పలపాడు
- భారీగా తరలి వచ్చిన విదేశీ అతిథులు..
- నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతున్న పక్షుల కేంద్రం



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో పక్షుల కేరింతలు

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పక్షుల కిలకిలరావాలు, విదేశీ పక్షుల విన్యాసాలతో గుంటూరు జిల్లా ఉప్పలపాడు పులకిస్తోంది. గ్రామంలో ఎటు చూసినా పక్షుల విన్యాసాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి... శీతాకాలం ప్రారంభ సమయంలో విదేశీ పక్షులు ఇక్కడకు వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఈ నెలలో అత్యధికంగా ఓపెన్ బిల్డ్ స్టార్క్ అనే పక్షి జాతి ఇక్కడికి వచ్చింది. దక్షిణాఫ్రికా నుండి ఈ పక్షులు ఇక్కడికి వచ్చాయి. ఇవి కాకుండా వైట్ హైవేస్, డాటర్/ స్నేక్ బర్డ్, కొరముఠంటూ, ఫెలికాన్స్, పెయింటెడ్ స్టార్క్ ఇలా పక్షుల జాతులు వస్తుంటాయి. సంతానోత్పత్తి తర్వాత తిరిగి నవంబర్, డిసెంబర్ నెలలో వాటి స్వస్థలాలకు వెళ్ళిపోతాయి. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని సందర్శించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తుంటారు. సెలవు దినాలు, శని, ఆదివారం రోజుల్లో సందర్శకుల సందడి ఎక్కువగా ఉంటోంది.

21న గుంటూరుకు బీవీ రాఘవులు రాక

తాడేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 21వ తేదీన జరిగే సమకాలీన రాజకీయ పరిణామాలపై సభలో ప్రధాన వక్తగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పాల్గొంటారని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం రవి తెలిపారు. ఉండవల్లిలోని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుంటూ రు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 21న సమకాలీన రాజకీయ పరిణామాలపై సభ నిర్వహించన్నుట్టు తెలిపారు. ఈ సభలో బివి రాఘవులుతో పాటు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వర రావు, టీ బక్కిరెడ్డి, అత్తలూరి వీర వెంకయ్య, ఉండవల్లి పార్థసారధి, పీ రాఘవులు, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో ముమ్మరంగా పూడికతీత పనులు


జేసీబీతో డ్రెయిన్లలో పూడిక తొలగింపు

మంగళగిరి సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళగిరి పట్టణంలోని రత్నాలచెరువు ఎస్టీ కాలనీ, సర్వీసు రోడ్డు, కాజ వాటర్ ట్యాంకు వద్ద జేసీబీలతో పూడికతీత పనులను జరిపిస్తున్నారు. ఎంటీఎంసీ పరిధిలోని చిన్న, పెద్ద కాలువల్లో సిల్టు తొలగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన జరిపిస్తున్నట్టు కమిషనర్ అలీమ్ బాషా తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలను 7093912653 నెంబరుకు ఫోను చేసి అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు చేపడతామని తెలియజేశారు.

గ్రామాల్లో పల్లె పండుగ


పెదపాలెంలో కల్వర్టు, రోడ్ల శంకుస్థాపనలో పాల్గొన్న కేసంనేని శ్రీఅనిత తదితరులు

దుగ్గిరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం, శృంగారపురం, చినపాలెం గ్రామాల్లో పల్లెపండుగ మంగళవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద రెండో రోజు మూడు గ్రామాల్లో కల్వర్టులు, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ డీఈ గుప్త, ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ టీ గోవర్ధనరావు, ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ప్రధానకార్యదర్శి తాళ్ల అశోక్‌యాదవ్, గ్రామసర్పంచులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన ఘటన మండలపరిధిలోని జాతీయ రహదారిపై జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు అరుంధతినగర్‌కు చెందిన మహమ్మద్ బాసిల పర్వీన్ (16) ద్విచక్రవాహనంపై మంగళవారం గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెలుతున్నది. అయితే బోయపాలెం సమీపంలో ముందువెలుతున్న కారు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక స్కూటీపై ఉన్న పర్వానా బండిని కంట్రోల్ చేయలేక వెనుక వైపున గుద్దుకుని అక్కడి కక్కడే మరణించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దుగ్గిరాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యువకుడు మద్యం మత్తులో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామంలో రాడ్ బెండింగ్ పని చేస్తూ జీవించే అద్దంకి కనకారావు(39) ఈనెల 21న మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగాడు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

● ఎంపీడీవో శివపార్వతి


విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు, అక్టోబరు 15: (ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం మన చేత్లోనే ఉందని ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి విద్యార్థులకు సూచించారు. ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మన శుభ్రతే మనకు శ్రీ రామ రక్ష అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి రవికుమార్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ ఖజా, స్వచ్ఛభారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ డబ్బూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రతతో వ్యాధులు దూరం

ఫిరంగిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజు చేతులను శుభ్రంగా ఉంచుకోవటం వల్ల వ్యాధి కారక క్రిములు తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మంగళవారం వేములూరిపాడు, ఫిరంగిపురంలోని శాంతిపేట, వేమవరంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

కలాం జీవితం స్ఫూర్తిదాయకం

మంగళగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్లో మంగళవారం కలాం చిత్ర పటానికి నివాళి అర్పించారు. జాగృత భారత్ ట్రస్టు తరపున 1200 మంది విద్యార్థులకు చాక్లెట్ బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృత భారత్ ట్రస్టు అధ్యక్షుడు పసుపులేటి గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అన్నారు.

● కాకుమాను, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు విద్యలో రాణించాలని ఎంపీడీవో యుగకీర్తి విద్యార్థులకు సూచించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి నివాళి అర్పించారు.

సొంతింటి కల.. సాకారమయ్యేందుకు పక్కా ప్రణాళిక

● మన ఇల్లు - మన గౌరవంతో గొప్ప అవకాశం
● నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు మార్చి వరకు గడువు


కాలనీలలో అర్థాంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కల సాకారమయ్యేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను తయారు చేసింది. ఏ లబ్ధిదారుడు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తిచేసేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక బృహత్తర అవకాశాన్ని కల్పించింది. పిచ్చిమొక్కలతో నిండి అడుగు పెట్టడానికి కూడా వీల్లేకుండా ఉన్న కాలనీలకు మోక్షం కల్పించి ప్రజలు నివాసం ఉండేలా చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అందుకు గాను ఒక్కో లేఅవుట్‌కు ఒక్కో మండల స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించి వారితో గృహాలను పూర్తి చేయించే దిశగా అడుగులు వేస్తుంది. గత ప్రభుత్వంలో మేము కట్టేది ఇళ్లు కాదు.. ఊళ్లు అంటూ పలికిన మాటలు డాంబికాలు గానే కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో సగం గృహాలు పూర్తి కాగా కొన్ని గ్రామాల్లో అయితే నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి లబ్ధిదారున్ని చైతన్య పరిచి వారితో అర్థాంతరంగా ఆగిన గృహాలను పూర్తి చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. నియోజకవర్గంలో వివిధ దశల్లో ఆగిన ప్రతి గృహం వచ్చే ఏడాది మార్చి చివరికి పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో మన ఇల్లు, మన గౌరవం పేరుతో శ్రీకారం చుట్టింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 10406 గృహాలు మంజూరు అయ్యాయి. వాటిలో కేవలం 3275 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 7131 గృహాలను పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిలో 600 గృహాలకు ఒక్క బిల్లు కూడా అందలేదు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. గుంటూరు రూరల్‌కు సంబంధించి మొత్తం 1596 గృహాలు మంజూరు కాగా అందులో 1418 వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే ప్రత్తిపాడు మండలంలో 1713 గృహాలు మంజూరు కాగా 1161 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలంలో 1307 గృహాలు మంజూరు కాగా 877 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 5790 గృహాలు మంజూరు కాగా అందులో 3675 గృహాలే వివిధ దశల్లో ఉన్నాయి. కాకుమాను మండలంలో 574 గృహాలు మంజూరు కాగా అందులో కేవలం 85 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 489 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. పెదనందిపాడు మండలంలో 280 గృహాలు మంజూరు కాగా అందులో 76 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 204 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పని చేస్తుంది

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


ఎమ్మెల్యేకి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న రావి శివరామకృష్ణయ్య

కాకుమాను, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పని చేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పష్టం చేశారు. మండలపరిధిలోని కొమ్మూరులో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, అలాగే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ కొమ్మూరు గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధికి ప్రజలు కూడా భాగస్వామ్యం అవ్వాలని తెలిపారు. అలాగే అప్పాపురం చానల్, కొమ్మమూరు కెనాల్, నల్లమడ ఆధునీకరణ వల్ల చివరి భూములకు కూడా సాగు నీరు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులకు నష్ట పరిహారం విషయంలో కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయిన వాటి పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఏవో కిరణ్మయికి చెప్పారు. ప్రజలు సమస్యల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని చెప్పారు. అనంతరం గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్‌లో కూలింగ్ వాటర్ యంత్రాల ఏర్పాటు కోసం పెదనందిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య రూ.లక్ష రూపాయల చెక్కును రామాంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సువ్వల సునీల్ చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి, రైతు విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, మాజీ ఎంపీపీ శైలజ, మాజీ ఎంపీపీ శరత్‌బాబు, నాయకులు మహేష్, వెంకట సుబ్బయ్య, పెద్ది రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎమ్మెల్యే ఆగ్రహం

కొమ్మూరు పంచాయతీ కార్యదర్శి రంగారావుపై స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దృష్టికి గ్రామం సమస్యలను స్థానికులు ప్రస్థావించారు. గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త బ్యాంకు ఖాతాకు రూ.15 లక్షలు పంచాయతీ కార్యదర్శి రంగారావు నగదు బదిలీ చేశారని చెప్పారు. ఐదేళ్లుగా గ్రామంలో పంచాయతీకి వచ్చిన నిధులు, చేసిన ఖర్చులు తదితర అంశాలను క్షుణ్ణంగా విచారణ చేసి నివేదికను అందజేయాలని ఎంపీడీవో యుగకీర్తి, ఈవోపీఆర్డీ శేఖర్‌లను ఆదేశించారు.

ప్రజల ప్రాణాలే ముఖ్యం

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి మద్యం ఆదాయం కన్నా ప్రజల ప్రాణాలు ముఖ్యమని ఎమ్మెల్యే బూర్ల స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని కొమ్మూరులో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మద్యం టెండర్ విషయంలో జగన్ మాట్లాడుతున్న తీరు అత్యంత బాధ్యతారహితంగా ఉందని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నూతన మద్యం విధానాల్లో టెండర్‌లు బ్యాంకుల నుంచి జరిగాయన్నారు. మద్యం దుకాణాల నుంచి జరిగే లావాదేవీలు కూడా బ్యాంకుల ద్వారానే జరుగుతాయన్నారు

శరీర దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

● ఎయిమ్స్ డైరెక్టర్ మధబానందకర్


అనాటమీ డే ర్యాలీలో పాల్గొన్న ఎయిమ్స్ డైరెక్టర్ మధబానందకర్, వైద్యులు, విద్యార్థులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శరీరదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఎయిమ్స్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధబానందకర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ అనాటమీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ఎయిమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం శరీర దానంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మధబానందకర్ ర్యాలీని ప్రారంభించారు. ఎయిమ్స్ నుంచి మంగళగిరి బస్టాండు వరకు ర్యాలీ సాగింది. మరణానంతరం శరీరాన్ని దానం చేయండి.. వైద్యవిద్యను ప్రోత్సహించండి అంటూ వైద్య విద్యార్థులు ప్లకార్డులను చేతబూని నినాదాలు చేశారు. శరీర దాతల బంధువులు, రిజిస్టర్ కాబోయే దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధబానందకర్ మాట్లాడుతూ మరణానంతరం మృతదేహాలను ఖననం చేయకుండా ఆసుపత్రులకు దానం చేస్తే వైద్య విద్యార్థుల అధ్యయనానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనాటమీ విద్యను ప్రోత్సహించడం ద్వారా మానవ ఆరోగ్యం, వ్యాధులను అర్థం చేసుకోవడంలో పురోగతి సాధించడంతోపాటు పరిశోధనలకు ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. శరీర దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ డాక్టర్ శ్రీమంతకుమార్, ప్రోటోకాల్ విభాగం చైర్మన్ డాక్టర్ పీకే శంకరన్, అధికార ప్రతినిధి డాక్టర్ కే.వంశీ కృష్ణారెడ్డి, ఎయిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పల్లెపండుగ వారోత్సవాలు

తాడికొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలో వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. మండలంలోని నిడుముక్కల, మోతడక, లచ్చన్నగుడిపూడి, ముక్కామల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నాయి. నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పేర్కొన్నారు.

ఇరువర్గాలపై బైండోవర్

ఫిరంగిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపాలెం గ్రామంలో కొంత కాలంగా ఇరువర్గాల మధ్య జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు స్థానిక తహసీల్దార్ జే ప్రసాదరావు ముందు ఇరువర్గాలను హాజరు పరిచి 30 మందికి రూ.3 లక్షలు చొప్పున బైండోవర్ చేయించి ఇకపై ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా, ప్రోత్సహించిన వారు ప్రభుత్వానికి రూ.3 లక్షల నగదు చెల్లించాలని హెచ్చరించి పంపించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పెదనందిపాడు, అక్టోబరు, 15(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో నారాయణ 2వ వర్ధంతి సందర్భంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) వారి సహకారంతో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి పెంపొందించుకునేందుకు కుట్టు శిక్షణ దోహదపడుతుందని, దీనిని మహిళలు సద్వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో 30చోట్ల విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని, అవి పార్టీ కార్యాలయాలుగా కాకుండా ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. తేళ్ళ నారాయణ సమాజం మార్పు కోసం రైతుల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. గుంటూరు ఛానెల్‌ను పొడిగించి ఈ ప్రాంత తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కేంద్ర సహాయ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో కుట్టు మిషన్ కార్యక్రమానికి చేయూత నందిస్తున్న నాట్స్ మాజీ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. తొలుత తేళ్ళ నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, కాపు శ్రీనివాసరావు, కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్, కొత్త వెంకటశివరావు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కె శ్రీనివాసరావు, చుక్కా యానాదులు తదితరులు పాల్గొన్నారు.


డ్రెయినేజ్‌లను మెరుగు పరుస్తాం

● డీఈ ధనలక్ష్మి

వట్టిచెరుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ నేపథ్యంలో డ్రెయిన్‌ల దుస్థితిని నూతనంగా బాపట్ల డ్రెయిన్ సబ్ డివిజన్ డీఈ ధనలక్ష్మి, జేఈలు స్వర్ణలత, మాధవిలతో కలసి మంగళవారం మండలంలోని జల్లవాగు డ్రెయినేజ్ ఇతర సర్‌ప్లస్ కోర్సులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం తుపాన్ దృష్ట్యా అత్యవసరంగా నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా ఎక్కడెక్కడ డ్రెయినేజ్‌లు, సర్‌ప్లస్ కోర్సులకు గండ్లు పడే ప్రమాదం ఉందనే ప్రాంతాలను చెమళ్ళమూడి ప్రాంతం నుంచి వట్టిచెరుకూరు, పల్లపాడు, కారెంపూడిపాడు, ముట్లూరు ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజ్‌లను పరిశీలించారు.

విద్యార్థి దశలో ఎన్‌సీసీ క్రమశిక్షణ నేర్పిస్తుంది

హైకోర్టు సీనియర్ కౌన్సిల్ పోసాని వెంకటేశ్వర్లు


ఎన్‌సీసీ ప్రారంభ సభలో మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ కౌన్సిల్ పోసాని తదితరులు

మేడికొండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఎన్‌సీసీ క్రమశిక్షణ నేర్పిస్తుందని హైకోర్టు సీనియర్ కౌన్సిల్ పోసాని వెంకటేశ్వర్లు చెప్పారు. మేడికొండూరు మండలం పేరేచర్ల లోని ఇంటెల్ హైస్కూల్లో నూతనంగా 10ఏ బాలికల ఎన్‌సీసీ యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు ముందుకు రావాలని తద్వారా వారిలో జాతీయతా భావం పెంపొందడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. సభలో బీఎన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి ఎస్‌వీఎస్ సుదర్శన్, విశ్రాంత మేజర్ సి.రామ్మోహన్‌రావులు ప్రసంగించారు. తమ స్కూలుని గుర్తించి యూనిట్‌ని కేటాయించడంపై డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బత్తుల కరీముల్లారావ్, సుబేదార్ షేక్ ఇమామ్, ప్రిన్సిపాల్ అశోకా రాణి, ప్రధానోపాధ్యాయిని జె.సుకన్య, పాఠశాల పీడీ షేక్ రన్ను హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

తాడేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ వారి వెబ్‌సైట్‌లో ఈ నెల 30 నుంచి నవంబరు 6వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు తెలిపారు. అలాగే తహసీల్దార్ కార్యా లయం ద్వారా కూడా ఫారం 18 దాఖలు చేసి ఓటు నమోదు చేసుకోవచ్చని, ఫారం 18లో పాస్‌పోర్ట్ ఫోటో, గెజిటెడ్ ఆఫీసర్‌చే ధృవీకరించిన డిగ్రీ సర్టిఫికెట్ నకలు, ఓటరు ఐడీ కార్డు, ఆధార్ కార్డు కూడా జతపరచాలని తెలిపారు. ఓటరుగా నమోదు కావడానికి జూన్ 2021లోపు డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు.

సీతానగరంలో సమస్యలు పరిష్కరిస్తాం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 20వ వార్డు సీతానగరంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం పర్యటించారు. నీటి పైపులైన్లు, డ్రైనేజీ సమస్యల గురించి మాజీ కౌన్సిలర్ ఇట్టా బాస్కర్ మున్సిపల్ డీఈ రాము దృష్టికి తీసుకువచ్చారు. వార్డులోని సమస్యలపై సిబ్బందితో పరిశీలించి, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని డీఈ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఏఈలు పవన్, అనూష తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శ్రావణ్‌కుమార్

మేడికొండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద మేడికొండూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై పండుగ వాతావరణంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మంగళగిరిపాడు, డోకిపర్రు, మేడికొండూరు, వెలవర్తిపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం టెంకాయ కొట్టి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, ఎంపీడీవో చందన తదితరులతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందించండి

సీఎం చంద్రబాబుకు అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఆరికపూడి


సీఎం చంద్రబాబును కలసిన అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఆరికపూడి

వట్టిచెరుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చమళ్ళమూడి గ్రామంలో రామాలయ పునర్నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సాయం సకాలంలో అందించేలా చూడాలని చమళ్ళమూడి గ్రామ వాసి అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఆరికపూడి రమణారావు గ్రామానికి చెందిన సీతారామయ్య, టీడీపీ నాయకురాలు యడ్లపల్లి వాణితో కలసి మంగళవారం సీఎం నారా చంద్రబాబు నాయుడును కలసి విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామంలో దీర్ఘకాలిక సమస్యలను ఆరికపూడి వివరించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

● మేక్ స్కిల్డ్ సీఈవో పీ మధు


మాట్లాడుతున్న పీ మధు

వట్టిచెరుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నేటి సాంకేతిక విజ్ఞాన రంగంలో పోటీ దృష్ట్యా ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ ఐడియా స్కిల్స్ పెంపొందించుకోవాలని మేక్ స్కిల్డ్ సీఈవో పీ మధు సూచించారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐడీఎస్, ఏఐఎంఎల్ విద్యార్థులకు మేక్ స్కిల్డ్ వారి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన బీట్ క్యాంపు కార్యక్రమాన్ని మంగళవారం కళాశాల డైరెక్టర్ డీ శ్రీనివాసకుమార్ ప్రారంభించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జే అప్పారావు, ఏఐడీఎస్ హెడ్ చార్లెస్ జయరావు, ఏఐఎంఎల్ హెడ్ డీ రవికిరణ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు



ఫిరంగిపురంలో దివ్యాంగుల కోసం ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఫిరంగిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వేసే ప్రతి అడుగుకు అంగవైకల్యం అడ్డు కాదని, మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని యోజనతో దివ్యాంగులకు భవిత కేంద్రాలు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాయని ఎంఈవోలు మహబూబ్ సుభానీ, రవికాంత్‌లు అన్నారు. మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన ఎంఈవోలు మాట్లాడారు. ఫిరంగిపురం గ్రామంలోని కొత్తపేట భవిత కేంద్రంలో మంగళవారం ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులకు భవిత కేంద్రం సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో భవితకేంద్రం ఉపాధ్యాయిని విజయలక్ష్మి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలపతి విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్


గ్లోబల్ సర్టిఫికేషన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

తాడికొండ,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులకు ఎస్ఏపీ గ్లోబల్ సర్టిఫికేషన్‌లో ఉత్తీర్ణులు అయ్యారని కళాశాల సెక్రటరీ వై సుజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం గ్లోబల్ సర్టిఫికేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్న ఎస్ ఏపీ యూనివర్సిటీ అలియన్సెస్ సహకారంతో ఎస్ఏపీ సర్టిఫైడ్ అసోసియేట్‌లో ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించటంలో కళాశాల యాజమాన్యం ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్, కళాశాల అధ్యాపకులు, డీన్‌లు అభినందించారు.

శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం


శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దుగ్గిరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల లోని శ్రీకన్యకాపరమేశ్వరి సత్రంలో దసరా శరన్నవ రాత్రుల అనంతరం సోమవారం రాత్రి హోమం, అమ్మవారి ఆత్మా హుతి కార్యక్రమం నిర్వ హించారు. ఆర్య వైశ్యుల కులదైవమైన కన్యకా పర మేశ్వరి అమ్మవారి సత్రం నుంచి మహిళలు ఊరేగింపుగా బయలుదేరి, తుంగభద్రకాల్వ వద్దకు చేరుకుని కలశాలతో నీటిని తీసుకువచ్చి, సుహాసినులు తలపై పెట్టుకుని అమ్మవారికి సమర్పించారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో వెంకటేష్‌కు రజితం


రజిత పతకంతో వెంకటేష్

పొన్నూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పీబీఎస్ కళాశాలకు చెందిన బీకాం విద్యార్థి సీహెచ్ వెంకటేష్ జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రజిత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి తెలిపారు. మంగళవారం వెంకటేష్ అభినందన కార్యక్రమం కళాశాలలో జరిగింది. ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నగ్రోటా పట్టణంలో జరిగిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పీబీఎస్ కళాశాల విద్యార్థి వెంకటేశ్ పాల్గొన్నారు. 89కిలోల విభాగం స్నాచ్‌లో 112 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 142కిలోలు మొత్తం 254 కిలోల బరువును ఎత్తి రజిత పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీలో రాణించిన వెంకటేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఔరంగాబాద్‌లో శిక్షణ పొందాడు. పతకం సాధించిన వెంకటేశ్‌ను కళాశాల ప్రెసిడెంట్ కెప్టెన్ ఎస్.అంకప్పచౌదరి, కార్యదర్శి ఎస్.అన్నారావు, అధ్యాపకులు కె.భానుప్రసాద్ తదితరులు అభినందించారు.

కొండచిలువ హతం


10 అడుగులున్న కొండచిలువ

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర సమీపంలోని కోళ్ళ ఫారంలో చొరబడి కోళ్లను మింగేస్తున్న కొండచిలువను స్థానికులు హతం చేశారు. మూడు రోజులుగా రాత్రి సమయాల్లో రోజుకు ఏడు, ఎనిమిది కోళ్ళు మాయమవుతుండటంతో కోళ్ళ పరిశ్రమ యజమాని భీమవరపు బ్రహ్మారెడ్డి పనివారిని అప్రమత్తం చేసి నిఘా పెట్టించాడు. దీంతో అర్ధరాత్రి సమయంలో ఒక భారీ కొండచిలువ కోళ్ళ ఫారంలోకి వచ్చి కోళ్ళను తినటం గమనించారు. పనివారు తొలుత భయాందోళన ఉన్నా ధైర్యం చేసి కొండచిలువపై దాడి చేసి చంపేశారు. గతంలో కొండచిలువ ఈ ప్రాంతంలో ఎప్పుడూ గుర్తించలేదు. అయితే కృష్ణానది వరదలు కారణంగా కొండచిలువ కొట్టుకువచ్చినట్లు భావిస్తున్నారు. కొండచిలువ సుమారు 10 అడుగులు ఉంటుందని కోళ్ళ పరిశ్రమ రైతు బ్రహ్మారెడ్డి తెలిపారు.

అధ్వానంగా వ్యర్థాల నిర్వహణ

● కాగితాలకే పరిమితమైన జీరో గార్బేజ్
● డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్తగుట్టలు
● ఫలితమివ్వని మూడు బుట్టల విధానం


డంపింగ్ యార్డులో కొండలా పేరుకుపోయిన వ్యర్థాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాల నిర్వహణలో అవార్డులు సాధించిన మున్సిపాలిటీలో సేకరణే తప్ప నిర్వహణ ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా డంపింగ్ యార్డులో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. గత ఐదేళ్లకు ముందు డంపింగ్ యార్డు చూసినవారు ప్రస్తుతం అక్కడ పరిస్థితి చూస్తే నోరెళ్లబెట్టక తప్పని పరిస్థితి ఉంది. పట్టణంలో సేకరించిన వ్యర్థాల నిర్వహణ అద్భుతంగా చేపట్టి జీరో గార్బేజీ స్థాయికి తేవాలన్న లక్ష్యం కాగితాలకే పరిమితం అవుతోంది. వ్యర్థాలను వేరుచేసి డంపింగ్ యార్డులో సైతం ప్రదేశాన్ని ఖాళీ చేసి మొక్కలు కూడా నాటాలనే నాటి పాలకులు, అధికారులు తలచారు. కానీ గత ఐదేళ్లలో ప్రభుత్వ పాలన అవినీతి ఆక్రమణలతో నిండిపోవడంతో ఈ వ్యర్థాల నిర్వహణ కూడా సేకరణకు పరిమితం అయింది. పట్టణంలో 40వార్డులలో వ్యర్థాల సేకరణ డంపింగ్ యార్డుకు తరలించడం తప్ప నిర్వహణ చేయకపోవడంతో యార్డు స్థలం అంతా వ్యర్థాలు కొండలా పేరుకుపోతున్నాయి. ప్రతిరోజూ 80టన్నుల వరకు వ్యర్థాలను జిందాల్ కంపెనీ గుంటూరు సమీపంలో నిర్వహిస్తున్న ఇంధన ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తున్నా కూడా వ్యర్థాలు ఏ మాత్రం తగ్గడం లేదంటే నిర్వహణ పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది

ఫలించని మూడు బుట్టల విధానం...

వ్యర్థాల నిర్వహణ కోసం ప్రవేశ పెట్టిన మూడు బుట్టల విధానం ఏమాత్రం ఫలితం ఇవ్వడం లేదు. ప్రతి ఇంటికి ఈ పథకం కింద మూడు ప్లాస్టిక్ టిన్స్ కూడా మున్సిపాలిటీ రూ.లక్షలు వెచ్చించి అందించింది. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి, అధికారులకు పలుమార్లు అవగాహన కల్పించి ప్రజల్లో కూడా విస్తృత ప్రచారం చేసి మూడు బుట్టల విధానంలో సేకరించి నిర్వహించాలని చెప్పారు. కానీ ఏ ఇంటి నుంచి కూడా చెత్తను మూడు రకాలుగా సేకరించి తరలించే ప్రయత్నం చేయలేకపోయారు. ఒకపద్ధతిలో మాత్రమే సేకరించిన చెత్తను తీసుకువెళ్లేందుకు పరికరాలు అంతంత మాత్రంగా ఉంటే మూడు బుట్టల విధానం ఎక్కడ అమలు అవుతుందని పారిశుధ్య సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి తోడు ప్రతి ఇంటిలో మహిళల్లో అవగాహన కల్పించి తడి చెత్తను ఇళ్లల్లోనే ఎరువుగా మార్చి మొక్కలకు ఉపయోగించుకోవాలనే పథకాన్ని కూడా ప్రవేశ పెట్టి విఫలమయ్యారు.


బుర్రిపాలెం రోడ్డు వెంట పేరుకుపోతున్న వ్యర్థాల గుట్టలు

ఆటోలు వెనక్కు... పుష్‌కార్ట్‌లకు రిపేర్లు

వ్యర్థాల సేకరణకు 40 వార్డుల్లో ప్రవేశ పెట్టిన ఆటోలు వెనక్కిపోయాయి. వీటి నిర్వహణకు తగిన ధనం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు వాటిని చెత్త సేకరణకు నిలిపివేశారు. చెత్త సేకరణలో వినియోగించే పుష్‌కార్ట్‌లు వీల్‌బార్లు కూడా మరమ్మతులకు లోను కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య వలన పలు వార్డుల్లో వ్యర్థాల సేకరణ సక్రమంగా జరగడం లేదని మున్సిపల్ సమావేశాల్లో కూడా కౌన్సిలర్లు పలుమార్లు ప్రస్తావించారు.

తరలించినా తగ్గని వ్యర్థాలు

పట్టణంలో సేకరించిన వ్యర్థాల్లో జిందాల్ ఇంధన ఉత్పత్తి సంస్థకు తరలిస్తున్నప్పటికీ వ్యర్థాల గుట్టలు తగ్గడం లేదు. ప్రతిరోజూ లారీలు, కంపాక్టర్, ట్రాక్టర్లలో కొంత వరకు చెత్తను తరలిస్తున్నప్పటికీ డంపింగ్ యార్డులో గుట్టలు పేరుకుపోతున్నాయి. ప్రతి వార్డులో సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల పారిశుధ్య నిర్వహణపై ప్రభావం చూపుతోంది. గతంలో ప్రతిరోజు శుభ్రంగా ఉండే వీధులు ఇప్పుడు వారానికి రెండు రోజులు మాత్రమే శుభ్రంగా కనిపిస్తున్నాయి.

రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు

బుర్రిపాలెం రోడ్డులో మార్జిన్‌లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వ్యర్థాలు వేయకుండా స్తంబాలు నాటి ఇనుపకంచె వేశారు. అక్కడి నుంచి వ్యర్థాలు వేయడం పరిపాటి అయ్యింది. ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల నుంచి వివేకానంద సెంట్రల్ స్కూల్ వరకు వ్యర్థాల గుట్టలు మార్జిన్‌లో పేరుకుపోయాయి. దీంతో వాహనాలు ఎదురు వచ్చిన సమయంలో రోడ్డు మార్జిన్ దిగే అవకాశం లేకుండాపోయింది. పట్టణంలో నానాటికి జనాభా పెరుగుతూ వ్యర్థాల ఉత్పత్తి కూడా అదే పరిస్థితిలో ఉండటంతో నిర్వహణ పకడ్బందీగా అమలు కాకపోతే భవిష్యత్‌లో మరిన్ని అవస్థలు తప్పవని పలువురు సూచిస్తున్నారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు ప్రణాళిక రూపొందించి వ్యర్థాల సేకరణే కాదు... నిర్వహణ కూడా నిరూపించాలని కోరుతున్నారు.

విస్తారంగా వర్షాలు

తెనాలి అర్బన్, పొన్నూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా తెనాలి, పొన్నూరులో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. మంగళవారం తెరిపి ఇవ్వడంతో జనజీవనం సాఫీగా సాగింది. డివిజన్‌లోని మండలాల్లో నమోదైన వర్షపాత వివరాలు ఇలా వున్నాయి. పొన్నూరు మండలంలో అత్యధికంగా 70.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, తాడేపల్లిలో అత్యల్పంగా 5.6 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. చేబ్రోలు 35, దుగ్గిరాల 38.6, కాకుమాను 42.2, కొల్లిపర 22.6, మంగళగిరి 5.5, తెనాలి 19.8 మి.మీ వర్షపాతం నమోదు అయ్యిందని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. పొన్నూరులో భారీ వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. పలు గ్రామాలో లోతట్టు ప్రాంతాలో ఉన్న రహదారులు నీట మునిగి ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షానికి రహదారులు సైతం దెబ్బతిని గుంటలమయం అయ్యాయి.

1500 మందికి అన్నదానం

పొన్నూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని పిరాణే పీర్ గౌస్ ఆజామ్ దస్తగిర్ జెండా చెట్టు గార్మీ పండుగ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఆజామ్ దస్తగిర్ మహిమలను మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో 1500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నలుగురికి అబ్దుల్ కలాం పురస్కారాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నలుగురు ప్రముఖులకు భారతరత్న అబ్దుల్ కలాం పురస్కారాలు ప్రకటించారు. గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. నెహ్రూని కేతన్ విద్యా సంస్థల ఎండీ మురళీకాంత్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజండ్ల ఉమామహేశ్వర్, దాత మొవ్వా సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావులను ఎంపికచేసి ఈ నెల 20న గుంటూరు ఏసీ కళాశాలలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పురస్కారం ప్రదానం చేస్తారు.

బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లో వివా విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్ గ్రేడ్ 9 విద్యార్థి బొల్ల సత్యేంద్ర, గ్రేడ్ 6 విద్యార్థి బానాల ఇషాన్లు రామచంద్రాపురంలో ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 9వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచి గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ టీమ్ కాంస్య పతకాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉత్తేజాన్ని కలుగజేస్తాయని, వివా సంస్థ విద్యతో పాటుగా 9మంది వ్యాయామ ఉపాధ్యాయులతో అన్ని క్రీడలలో శిక్షణ అందిస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి గుర్తింపు దక్కించుకున్న సత్యేంద్ర, ఇషాన్‌లను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్బీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ సంధానకర్త కె.మాధవి, సంధానకర్త జ్యోతి మెట్లా బాస్కెట్ బాల్ కోచ్ టి. అనీల్ కుమార్ అభినందించారు.

రైతులకు రక్షణ కల్పించాలి

● కొసరాజు వెంకట్రాయుడు

పొన్నూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని రైతు సంఘం నాయకులు ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ డైరెక్టర్ కొసరాజు వెంకట్రాయుడు మంగళవారం అన్నారు. పంటలు సాగుచేసే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి, రైతులు, కౌలు రైతులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలలో ఉన్న విద్యుత్ తీగలను విద్యుత్ శాఖ మరమ్మతులుచేసి సరిచేయాలని సూచించారు. సాగు సమయంలో విష సర్పాల కాటుకు రైతులు బలవుతున్నారని, వారికి చికిత్సను అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో యాన్టీ వీనమ్ ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పురుగు మందులను పిచికారీ సమయంలోనూ రైతులు అనారోగ్యం బారినపడి మృతి చెందుతున్నారన్నారు. మరణిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

డ్వాక్రా మహిళలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన

తెనాలి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో ఆరోగ్యసంరక్షణ, పరిశుభ్రతలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప సర్పంచ్ నాగభూషణం మాట్లాడుతూ ఆదర్శగ్రామంగా అంగలకుదురును తీర్చిదిద్దుకుందామన్నారు. ఆరోగ్యకరమైన జీవనం గడిపేందుకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి అనీల్‌కుమార్, పలువురు గ్రామ పెద్దలు, డ్వాక్రామహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల్లో ప్రగతి

● కలెక్టర్ నాగలక్ష్మి


శేకూరులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాల ప్రగతికి ప్రభుత్వం బాటలు వేసిందని కలెక్టర్ కె నాగలక్ష్మి అన్నారు. చేబ్రోలు మండలం శేకూరులో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో మంగళవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామ సభల ద్వారా ప్రజల నుంచి విజ్ఞాపనలు స్వీకరించి మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. తొలిదశగా 150 పనులను పల్లె పండుగ ద్వారా పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ 150 పనులు రానున్న 3 నెలల కాలంలో పూర్తి చేసే లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. సంక్రాంతి నాటిని రెండో విడత పనులు మంజూరు చేయనునట్లు చెప్పారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి చిత్త శుద్ధితో కృషి చేస్తునట్లు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలో 30వేల పనులను ఈ పల్లె పండుగ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. రూ.4500కోట్లతో 3వేల రహదారులు, 500 కిలోమీటర్ల తారు రోడ్లు, 2 వేల గోకులాలు, 10వేల వాన నీటి సంరక్షణ కందకాలు ఈ పనులు ద్వారా చేపట్టనున్నామన్నారు. చేబ్రోలు మండలంలో వేజండ్లలో రూ.17 లక్షలతో రహదారి, శుద్ధపల్లిలో రూ.7 లక్షలు, శలపాడులో రూ.6 లక్షలు, వీరనాయకునిపాలెంలో రూ.4లక్షలు, శేకూరులో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా, డ్వామా పీడీ శంకర్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అబ్దుల్‌కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు అబ్దుల్‌కలామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సాల్మన్ రాజు మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అన్న మహనీయుడు అబ్దుల్‌కలామ్ అన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవో ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

పొన్నూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, అబ్దుల్ కలామ్ చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, లక్ష్మీనారాయణ చౌదరి, పఠాన్ అహ్మద్ ఖాన్, బండ్లమూడి బాబురావు, షేక్ జానీ బేగ్, ఆరె ప్రసాద్, కరిముల్లా జాబీ, చెన్నుపాటి భాస్కర్, షేక్ బాబ్జి, షేక్ బాజీ సాహెబ్, తోట ప్రసాద్, మున్నంగి సుబ్బారెడ్డి, షేక్ గౌస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కలిగి ఉండాలి

● స్వచ్ఛ భారత్ రిసోర్స్ కోఆర్డినేటర్ దివ్య

తెనాలి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కలిగి ఉండాలని స్వచ్ఛ భారత్ రిసోర్స్ కో ఆర్డినేటర్ జి.దివ్య అన్నారు. మంగళవారం మండలంలోని పెదరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ హ్యాండ్ వాష్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు చేతులు పరిశుభ్రతలు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులు ఆహారం తీసుకునే ముందు నీళ్లతో చేతులు కడుక్కోవడం సరైన విధానం కాదన్నారు. తప్పనిసరిగా సబ్బు లేదా హ్యాండ్ వాష్ లిక్విడ్స్‌తో 20 సెకన్ల పాటు చేతులను రుద్దుతూ కడుక్కోవాలన్నారు. తద్వారా చేతులపై ఉన్న బ్యాక్టీరియా, పలు రకాల క్రిములు నశిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తాము చేసే సూచనలు పాటిస్తూ పెద్దలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ కళాజ్యోతి విద్యార్థులకు చేతుల శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సరళ, కార్యదర్శి దానయ్య, నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు శిరీష, భాగ్యలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్చకులకు స్వయం ప్రతిపత్తి హర్షణీయం: అనంతాచార్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పించడం హర్షణీయమని అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అనంతాచార్యులు పేర్కొన్నారు. గంగానమ్మపేట వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, దేవాలయాలలో వైదిక కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసిందన్నారు. దేవాలయాల నిర్వహణలో రాజకీయ జోక్యం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. నిరుద్యోగులైన వేద పండితులకు నిరుద్యోగ భృతి ప్రకటించిన విధంగానే ఎనిమిదేళ్ల పాటు ఆగమ విద్యాలయాలలో చదివిన నిరుద్యోగ పండితులకు కూడా భృతి ఇవ్వాలని కోరారు. కొన్ని దేవాలయాలలో 43/10 రిజిస్టర్ల పని పూర్తి కాలేదని, వీటిపై చర్యలు తీసుకోవాలని డీడీఎన్ఎస్ స్కీం కింద దరఖాస్తులు ఆమోదించాలని కోరారు. గ్రీవెన్స్ సెల్ ప్రతినెలా డిప్యూటీ కమిషనర్ నిర్వహించడానికి అంగీకరించారని ప్రతి నెలా 2, 4 మంగళవారాల్లో అర్చకులు తమ సమస్యలను గ్రీవెన్స్ సెల్ దృష్టికి తేవాలన్నారు. తమిరిశ రఘు, పెనుమూడి సుబ్బారావు, గురునాథ ప్రసాద్, వెంకటరమణ ఆత్రేయ పాల్గొన్నారు.

మహిళా మండలి భవనం

పురపాలక సంఘం ఆధీనంలోకి


కమిషనర్ శేషన్నకు స్వాధీన పత్రాలను అందిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, చైర్‌పర్సన్ రాధిక తదితరులు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం ఆధీనంలోకి మహిళ మండలి భవనం వచ్చింది. కొత్తపేటలోని మహిళ మండలి భవనంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళా మండలి భవన రిజిస్ట్రేషన్ పత్రాలను తహసీల్దార్ గోపాలకృష్ణ పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్నకు అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గత పదిరోజుల క్రితం ఎంతో విలువైన 514 గజాల స్థలంలో నిర్మించిన మహిళా మండలి భవనాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ ముద్దన కస్తూరీబాయి ప్రభుత్వానికి అందజేశారు. మంగళవారం కలెక్టర్ నాగలక్ష్మి అనుమతితో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌తో భవనాన్ని పురపాలక సంఘానికి స్వాధీనం చేశామన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ మహిళ మండలి దాతల ఆలోచనలకు అనుగుణంగా పట్టణ మహిళల అభివృద్ధికి కృషిచేస్తామని, మహిళా సాధికారతకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పురపాలక చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

● ఇన్‌చార్జి తహసీల్దార్ రాజా రమేష్‌మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాజా రమేష్ మోహన్

పొన్నూరు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించవద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ కె రాజా రమేష్ మోహన్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలపై వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ పెండింగ్ రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు భూ సమస్యలపై ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మ్యుటేషన్ సమస్యని పెండింగ్‌లో ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. అలాగే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీలో అలసత్వం చూపవద్దన్నారు. వీఆర్వోలకు లాగిన్ సౌకర్యం ఉన్నందున ఏ రోజు నమోదైన సమస్యలు ఆరోజే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులను శుభ్రపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి. వెంకట్రావు, ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఎంఈవో ఝాన్సీలత, మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలకానంద, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

● లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం

తెనాలి రూరల్,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరిపైర్లలో సుడిదోమ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బుర్రిపాలెం, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో ఏవో ప్రేమసాగర్‌తో కలిసి లాంఫాం శాత్రవేత్త రత్నం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వరిపైర్లను పరిశీలించి అందులో సుడిదోమ ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు డైనోటేఫ్యూరాన్ లేదా ఇథోపెన్ ప్రాక్స్ లేదా పైమెట్రోజిన్ వీటిల్లో ఏదో ఒక మందును వ్యవసాయశాఖ సూచనల మేరకు తగిన మోతాదులో పిచికారి చేయాలన్నారు. ఏవో ప్రేమసాగర్ నల్లి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు. తొలుత ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన సదస్సులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి కన్పించడం లేదని కుమార్తె ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లి కన్పించలేదని కుమార్తె ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేటకు చెందిన గవిని సుభాషిణి (89) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. కుమార్తె ఇంటి నుంచి ఆమె ఈ నెల 9వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆమె కోసం తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియక మంగళవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. కుమార్తె సుంకర ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

బెదిరింపులపై యువతి ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తనను బెదిరిస్తున్నారని యువతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మారీసుపేట పినపాడులో షేక్ సాజిల్ అనే యువతి నివాసముంటుంది. అదే ప్రాంతంలో నివాసముండే అబ్దుల్ ఖాదర్, సంధాని, ఆషా, బైజాన్‌లు తనను బెదిరింపులకు గురిచేసి మానసికంగా హింసిస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.